జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || సోమవారం 12, ఆగస్టు 2024 || ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం



## ఈ నెల 20 నుంచి కొత్త ఓటర్ల నమోదు

**అమరావతి,మహానాడు:** ఆంధ్రప్రదేశ్‌లో కొత్త ఓటర్ల నమోదు, పాత ఓటర్ల జాబితాలో సవరణలకు ఈసీ షెడ్యూల్ ప్రకటించింది. ఈ నెల 20వ తేదీ నుంచి బీఎల్ఓ లు ఇంటింటి సర్వేను నిర్వహించ నున్నారు. వచ్చే ఏడాది జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండేవారు కూడా ఇప్పుడే ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. అక్టోబర్ 18 నాటికి ప్రక్రియ పూర్తి చేసి, అదే నెల 29న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేస్తారు. నవంబర్ 28 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. జనవరి 6న తుది ఓటర్ల జాబితా ప్రకటిస్తారు.






# జగనేయుల పత్తేపారం!

- 'మహిళా'సేవలో వైకాపేయులు
- అక్కచెల్లెమ్మను పట్టించుకోని జగనన్న
- దువ్వాడ దువ్వవుడిని జగనన్న మెచ్చుకున్నారా?
- ఇంతకూ జగనన్న మద్దతు ఎవరికి?
- తమ్ముడు శీను అసలు భార్య వాణికా? కొసలు మరదలు మాధురికా?
- మొన్నటివరకూ ఉత్తరాంధ్రలో ఇద్దరు రెడ్ల కళాపోసన
- వైసీపీకి ఇంకా తగ్గని ఎండోమెంట్ అ'శాంతి'
- ఇప్పటికే వైసీపీకి శ్రీరెడ్డి సేవల శ్రమదానం
- గతంలో పవన్ పెళ్లిళ్లపై జగన్ విమర్శలు
- ఇప్పుడు దువ్వాడ ఎపిసోడ్‌లో మళ్లీ అవే తెరపైకి
- ఇదేం పత్తియాపారమంటూ తలపట్టుకుంటున్న జగనేయులు

### పెన్ 'కౌంటర్'



(మార్తి సుబ్రహ్మణ్యం)

పూర్వం చక్రవర్తులు, రాజులు కళలను పోషించేవారు. కళాకారులను ప్రోత్సహించేవారు. స్వయంగా వారూ కళాపోసన చేసేవారు. అది వేరే వ్యవహారం. రాజుల కాలం అంతరించి, ప్రజాస్వామ్యం వచ్చిన తర్వాత కళాకారులను పోషించేవారు లేకుండా పోయారన్న ఆవేదన- దిగులూ గత ఐదేళ్ల క్రితం వరకూ ఉండేది. కానీ మైనింగ్ డాన్ గాలి జనార ర్దన్‌రెడ్డికి, దేవుడిచ్చిన తమ్ముడయిన జగనన్న వైసీపీ పెట్టిన త ర్వాత, కళాకారులకు ఆ దిగులు తీరింది. జగనన్నియ్య ఆవిధంగా కళాకారులను ప్రోత్సహిస్తూ ముందుకెళుతున్నారు.

దానితో జగనన్న పార్టీలో కళాకారులతోపాటు.. గంట-అరగంట పార్ట్‌టైమ్ కళాకారులు' కూడా 'తీరికలేనంత కళాపోసన'లో బిజీగా అయ్యారు. అంటే ఆ రకంగా మహిళా సేవలో ముందుకువెళుతుంటే, మధ్యలో ఈ దుర్మార్గ మీడియా రంధ్రాన్వేషణలు కొన్ని.. జగనేయుల కర్మ కాలి తమంతట తాము దొరికి మరికొన్ని.. మధ్యలో అక్కచెల్లెమ్మలు మీడియా ముందుకొచ్చి, జగనేయుల కళాపోసన బయటపెట్టిన కేసులు ఇంకొన్ని బయటపడుతున్నాయి. లేకపోతే వైకాపేయుల మహిళాసేవ బయట ప్రపంచానికి తెలిసేదికాదు. జగనేయులకు ఇలాంటి ప్రచారం అస్సలు నచ్చదు. గుప్తదానం మాదిరిగా ఇదో గుప్తసేవ అన్నట్టు! మిగతా.. 2లో

## నల్లపాడు సహకార సొసైటీలో

# నకిలీ రుణాలు!

- బ్యాంకు నోటీసులతో అన్నదాత ఆందోళన
- గుట్టు రట్టవడంతో క్షణాల్లో చెల్లింపు
- వ్యవహారం మరుగునపరిచే యత్నాలు

(వాసిరెడ్డి రవిచంద్ర)




గుంటూరు జిల్లా నల్లపాడు సహకార సొసైటీలో నకిలీ రుణాల వ్యవహారం వెలుగు చూసింది. మిర్చి రైతులు కోల్ట్ స్టోరేజ్‌లలో నిల్వ చేసిన మిర్చిను చూపి వ్యాపారులు భారీగా రుణాలు పొందారు. రైతులకు తెలియకుండా వారి పేరుతో నకిలీ రుణాలు పొందారు. వైసీపీ ప్రభుత్వంలో జరిగిన ఈ నకిలీ రుణాలు స్కాం అధికారులు సహకరించారు. సంబంధం లేని రైతులకు నోటీసులు రావడంతో లబోదిబో అంటున్నారు. జిల్లాల్లోని సహకార సొసైటీలలో వైసీపీ నేతలు అందినకాడికి దోచుకున్నారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేల కోట్లు నకిలీ రుణాలు పొందారు. వాటిలో తాజాగా ప్రత్తిపాడు నియోజకవర్గం లోని నల్లపాడు సహకార సొసైటీలో నకిలీ రుణాల బాగోతం బయటపడింది. కోల్ట్ స్టోరేజ్‌లో రైతులు నిల్వ చేసిన మిర్చిను చూపించి రైతులకు తెలియకుండా మిర్చి వ్యాపారులు భారీగా రుణాలు పొందారు. వట్టిచెరుకూరు మండలం లేమల్లెపాడు కు చెందిన సుధాకర్ అనే వ్యక్తి పేరుతో బ్యాంకు నుంచి నోటీసులు రావడంతో ఈ రుణాలు కుంభకోణం వెలుగులోకి వచ్చింది. సుధాకర్ పేరుతో నకిలీ రుణాలు మీడియాలో రావడం హడావుడిగా అతని పేరుతో తీసుకున్న రుణం తక్షణమే చెల్లించినట్టు తెలుస్తోంది. నల్లపాడు బ్రాంచ్‌లో రైతుల పేరుతో తీసుకున్న రుణాల సొమ్ముతో తాడికొండ ప్రాంతంలో మిగతా.. 2లో



## అమెజాన్ వెబ్ సర్వీసెస్ విస్తరణ

- ఏఐ ఆధారిత డేటా సెంటర్ పై చర్చలు
- అమెరికా పర్యటనలో కంపెనీ ప్రతినిధులతో సంప్రదింపులు

**హైదరాబాద్,మహానాడు:** అమెజాన్ కంపెనీ హైదరాబాద్‌లో తన డేటా సెంటర్ ను విస్తరించే పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి ప్రదర్శించింది. అమెజాన్ వెబ్ సర్వీసెస్ డేటా సెంటర్ ప్లానింగ్ అండ్ డెలివరీ వైస్ ప్రెసిడెంట్ కెర్రీ పర్సన్, కంపెనీ ప్రతినిధి బృందంతో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు సమావేశమయ్యారు. తెలంగాణలో డేటా సెంటర్ కార్యకలాపాలపై చర్చలు జరిపారు.

ఇప్పటికే తెలంగాణలో అమెజాన్ కంపెనీ కార్యకలాపాలను విస్తరించింది. ప్రపంచంలోనే అమెజాన్ కంపెనీకి చెందిన అతిపెద్ద కార్పొరేట్ భవనం హైదరాబాద్లో ఉంది. గత ఏడాది అమెజాన్ డెడికేటేడ్ ఎయిర్ కార్గో నెట్‌వర్క్ 'అమెజాన్ ఎయిర్' ప్రారంభించింది.

అమెజాన్ వెబ్ సర్వీసెస్ కు సంబంధించి హైదారాబాద్లో మూడు డేటా సెంటర్లు ఇప్పటికే పనిచేస్తున్నాయి. అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్ ఆధారిత సేవలతో కొత్త హైపర్ స్కేల్ డేటా సెంటర్‌తో పాటు తమ వ్యాపారాన్నివిస్తరించే ఆలోచనలను ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు పంచుకున్నారు. మిగతా.. 2లో



08

ఎయిర్ పోర్టు నిర్మాణం పనులు సంతృప్తికరం



05

ఆ చెట్టు ఉంటే సినిమా హిట్టే!



06

ఐదేళ్ల పాపాలపై కూటమి ప్రభుత్వం అలసత్వం!




06

యువత సొంత కాళ్లపై నిలబడేలా చేయడమే అసలైన సంక్షేమం

## దటీజ్ లోకేష్!

నాడు పాదయాత్రలో 200 యూనిట్లు కరెంట్ వచ్చిందని జగన్ ప్రభుత్వం పింఛన్ తొలగించారని నాడు పాదయాత్రలో లోకేషన్నని కలిసి వాపోయిన దివ్యాంగుడు... నేడు గుర్తొంచుకొని మరీ లోకల్ తహసీల్దార్‌కి పోన్ చేసి పింఛన్ పునర్ధించాలని ఆదేశాలు జారీ చేసిన మంత్రి నారా లోకేష్.. తొలి వందరోజుల్లోనే తన పింఛన్ అందటంతో అనందాన్ని వ్యక్తం చేసిన బాధిత దివ్యాంగుడు.





## కరోనా మళ్ళీ వచ్చింది

- 84 దేశాల్లో భారీగా కేసులు
- ప్రపంచ ఆరోగ్య సంస్థ వార్నింగ్

**పారిస్:** కరోనా మళ్లీ వచ్చింది. 84 దేశాల్లో భారీగా పాజిటివ్ కేసులు నమోదు అవుతున్నాయి. ఈ మేరకు ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరించింది. 2024. ఆగస్టు రెండు వారాల్లో కేసులు సంఖ్య, సాధారణం కంటే 20 శాతం పెరిగినట్లు ప్రకటించింది. అంతేకాదు.. పారిస్ ఒలింపిక్స్ లో 40 మంది అథ్లెట్లు కరోనా సంబంధమైన శ్వాసకోశ వ్యాధుల బారిన పడ్డారని వెల్లడించి కలకలం రేపింది. కోవిడ్ టెస్టులు చేస్తే 10 శాతం పాజిటివ్ కేసులు నమోదైయ్యాయని ప్రపంచ మిగతా.. 2లో

## ఫైనాన్స్ డిపార్టుమెంటులో

# 8 శాతం కమీషన్లు




- రేవంత్ రెడ్డికి బండి సంజయ్ కోవర్టు
- రేవంత్ రెడ్డికి సహాయ మంత్రిగా బండి సంజయ్
- తమ్ముడి కంపెనీతో రేవంత్ రెడ్డి ఎట్లా ఒప్పందాలు చేసుకుంటారు?
- ఆరు గ్యారెంటీలపై బీజేపీ నేతలు ఎందుకు అడగడం లేదు?
- సుంకిశాల ప్రాజెక్టు ప్రమాదంపై ప్రభుత్వం ఇప్పటి వరకు స్పందిచలేదు
- ప్రమాదం సోషల్ మీడియా ద్వారా మా దృష్టికి వచ్చినట్లు ప్రభుత్వం చెప్పడం సిగ్గుచేటు
- ఎమ్మెల్యేలు కె.పి.వివేకానంద,ముఠా గోపాల్

**హైదరాబాద్,మహానాడు:** రాష్ట్ర ప్రభుత్వ పనితీరు అస్తవ్యస్తంగా మారింది. రాష్ట్రంలో షాడో ముఖ్యమంత్రులు, షాడో మంత్రులు పరిపాలన చేస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీ అవగాహనతో బిఆర్ఎస్ మిగతా.. 2లో

## కొట్టుకుపోయిన తుంగభద్ర గేటు!



- డ్యామ్ గేట్లు మూసివేస్తుండగా తెగిన చైన్
- కర్నూలు జిల్లా ప్రజలకు అధికారుల హెచ్చరిక
- మంత్రి పయ్యావులకు సీఎం చంద్రబాబు ఫోన్

**బెంగళూరు, మహానాడు:** కర్ణాటకలోని హొస్పేట సమీపంలో ఉన్న తుంగభద్ర డ్యామ్ గేటు కొట్టుకుపోయింది. శనివారం రాత్రి డ్యామ్ గేట్లు మూసివేస్తుండగా చైన్ తెలిగిపోయింది. దీంతో 19వ నంబర్ గేటు ఊడిపోయింది. మిగతా.. 2లో

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ‖ సోమవారం 12, ఆగస్టు 2024



## 6 మెడల్స్.. 71వ స్థానం

● ఒలింపిక్స్‌లో భారత్ ప్రస్థానం

పారిస్: ఒలింపిక్స్ విశ్వ క్రీడల్లో భారత ప్రస్థానం ముగిసింది. ఇండియా మొత్తం 6 మెడల్స్ సాధించి టేబుల్లో 71వ స్థానంలో నిలిచింది. ఒక్క గోల్డ్ మెడల్ కూడా గెలవలేదు. గత టోక్యో ఒలింపిక్స్ లో బంగారు పతకం సాధించిన నీరజ్ చోప్రా ఈసారి సిల్వర్ తో సరిపెట్టుకున్నారు. మిగతా 5 మెడల్స్ కాంస్యాలే. ఇందులో మనూ భాకర్ 2, సరబ్ జోత్ సింగ్, స్వప్నిల్ కుసాలే, హాకీ టీమ్, అమన్ తలో మెడల్ గెలిచారు.



## నల్లపాడు సహకార సొసైటీలో నకిలీ రుణాలు!

(మొదటిపేజీ తరువాయి..)

రియల్ ఎస్టేట్ వెంచర్ లు వేసినట్టు తెలుస్తోంది. అయితే జీడీసీసీ బ్యాంకు నల్లపాడు బ్రాంచ్లో వెలుగు చూసిన అవినీతి వ్యవహారం మరుగునపరిచే ప్రయత్నాలు పెద్దఎత్తున జరుగుతున్నట్టు రైతులు ఆరోపిస్తున్నారు.

ఒక కోల్డరేజ్‌లో నిల్వ చేసిన సరుకుకు రూ.53 కోట్ల రుణం ఎలా ఇచ్చారనేది మిస్టరీగా మారింది. దాదాపుగా 150 మంది రైతుల పేర్లతో ఈ రుణాలు తీసుకున్నట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో కొందరి ఆధార్లు, పట్టాదారు పాసుపుస్తకాలు నకిలీవి సృష్టించి బ్యాంకు నుంచి రుణం పొందారు. అసలు పొలం లేని వ్యక్తుల పేర్లతో రుణం మంజూరైందంటే నకిలీ పట్టాదారు పాసుపుస్తకాలు కూడా సృష్టించి ఉంటారని తెలుస్తోంది. పల్నాడు జిల్లాలోని మాచర్ల, గురజాల నియోజకవర్గాలకు చెందిన వైసీపీ నేతలు కూడా రుణాలు పొందినట్టు ఆరోపణలు వస్తున్నాయి.

దీనిపై ఇప్పటికే మంత్రి అచ్చెన్నాయుడు, గుంటూరు కలెక్టర్‌కు ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ఆధ్వర్యంలో రైతులు ఫిర్యాదు చేయగా వారు విచారణకు ఆదేశించారు. కాగా బ్యాంకు నుంచి తీసుకున్న రుణంతో తాడికొండ, అమరావతి రాజధాని పరిసర ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపార రంగంలో పెట్టుబడులు పెట్టినట్టు భోక్తలపై ఆరోపణలు వస్తున్నాయి. వట్టిచెరుకూరుకు చెందిన సుధాకర్ అనే వ్యక్తి ఆందోళనతో ఆయన పేరు మీద తీసుకున్న రుణం రూ.10 లక్షలు తిరిగి చెల్లించేశారు. అంతమాత్రాన జరిగిన నేరాన్ని కప్పి పెడతారా అని టీడీపీ శ్రేణులు బ్యాంకు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

నల్లపాడు సొసైటీ రుణాల కుంభకోణం పై విజిలెన్స్, సహకార శాఖ అధికారులు విచారణలు జరిపితే అసలు సూత్రధారులు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని రైతులు అంటున్నారు.

## కొట్టుకుపోయిన తుంగభద్ర గేటు!

(మొదటిపేజీ తరువాయి..)

నీరు భారీగా కిందకి వస్తోంది. డ్యామ్‌కు ఇటీవల వరద పోటు పెరిగింది. అధికారులు మొత్తం 33 గేట్లు ఎత్తి నీటిని వదిలారు. శనివారం వరద తగ్గడంతో గేట్లు మూసేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలోనే గేటు ఊడిపోయిందని అధికారులు వెల్లడించారు. దీంతో 35 వేల క్యూసెక్కుల నీరు కిందికి వెళుతోందని చెప్పారు.

డ్యామ్ గేటు ఊడిపోవడంతో ఆంధ్రప్రదేశ్ లోని కర్నూలు జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా కౌతాలం, కోస్గి, మంత్రాలయం, నందవరం మండలాల ప్రజలపై ప్రభావం ఉండవచ్చని పేర్కొంది. సహాయం కోసం 1070 112, 1800 425 0101 నంబర్‌కు కాల్ చేయాలని కోరింది. అయితే, గేటును పునరుద్ధరించేందుకు కర్ణాటక అధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు. డ్యామ్‌లో నుంచి 60 టీఎంసీల నీటిని బయటకు పంపాక గేటును అమర్చుతామని ప్రకటించారు. కాగా, డ్యామ్ గేటు కొట్టుకుపోయిన విషయం తెలిసి కర్ణాటక మంత్రి శివరాజ్ ఆదివారం ఉదయం తుంగభద్ర డ్యామ్ వద్దకు వెళ్లి పరిశీలించారు.

### మంత్రులు, అధికారులకు చంద్రబాబు ఫోన్

తుంగభద్ర డ్యామ్ గేటు కొట్టుకుపోవడంపై ఏపీ సీఎం చంద్రబాబు ఆరా తీశారు. డ్యామ్ వద్దకెళ్లి పరిస్థితిని గమనించాలని,



అక్కడి పరిస్థితిని తనకు వివరించాలని కర్నూలు సీఈ, విజయవాడ సెంట్రల్ డిజైన్స్ కమిషనర్, జాతీయ డ్యామ్ గేట్ల నిపుణులు కన్నం నాయుడిని ఆదేశించారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని సీఎం ఆదేశించారు.

తాత్కాలిక గేటు ఏర్పాటుపై డ్యామ్ అధికారులతో మాట్లాడాలని, అందుకు అవసరమైన సహకారం అందించాలని మంత్రి పయ్యావుల కేశవ్‌ను చంద్రబాబు ఆదేశించారు. అయితే, పాత డిజైన్ కావడం వల్ల స్టాప్‌లాక్ గేట్ ఏర్పాటు చేయలేని పరిస్థితి ఉందని మంత్రి తెలిపారు.

### ‘గేటు’ ఘటనపై సీఎం బాబు సమీక్ష

- రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

అమరావతి, మహానాడు: తుంగభద్ర డ్యాం గేటు కొట్టుకుపోయిన సంఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష చేశారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదివారం విలేఖర్లకు తెలిపారు. ఇంకా ఆయన మాట్లాడుతూ తుంగభద్ర డ్యాం సంఘటన ప్రదేశానికి చంద్రబాబు ఆదేశాలతో సెంట్రల్ డిజైన్ కమిషనర్ తో పాటు ఇంజనీరింగ్ డిజైన్స్ బృందాన్ని కూడా ఏర్పాటు చేసి పంపించాం. డ్యాం గేటు కొట్టుకుపోయినందున ప్రజలను అప్రమత్తం చేసేలా జిల్లా కలెక్టర్కు ఆదేశాలు ఇచ్చాం. కౌతాలం ,కోసిగి మంత్రాలయం, నందవరం మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టుల అధికారులను అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించాం.

## జగనేయుల పత్తేపారం!

(మొదటిపేజీ తరువాయి..)

గంటయినా-అరగంటయినా రెండో కంటికి, రెండో చెవికి వినపడకుండా లాగించేయడమే వారికి ఇష్టం!!

రెండురోజుల నుంచి శ్రీకాకుళం వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాసరావు మహిళా సేవ యవ్వారాన్ని, స్వయంగా ఆయన భార్య వాణినే బట్టబయలు చేసింది. కట్టుకున్న భార్యనయిన తనను, కూతురుని వదిలేసి మాధురి అనే మహిళకు సేవ చేస్తున్నారంటూ, ఆమె ఏకంగా దువ్వాడ ఇంటి ముందు బైఠాయించడంతో దువ్వాడ ఫ్యామిలీ కథ గత్తరయింది.




ఏమాటకామాట. మాధురి అనే కళాకారిణి కూడా వైకాపేయురాలే. ఆమె చేసిన డాన్సులను వీడియోల ద్వారా జాతికి అంకితం చేసిన గొప్ప కళాకారురాలు. శీనన్నయ్య ఆమెలోని టాలెంటును బాగా ప్రోత్సహించడంతో, పార్టీలో చేరిన వెంటనే మహిళా అధ్యక్షురాలయింది. ఎంత టాలెంటు లేకపోతే పార్టీలో చేరిన వెంటనే పార్టీ అధ్యక్షురాలు కాగలుతుంది చెప్పండి? ఆ టాలెంటే శీనన్నియ్యను అట్రాక్టు చేస్తే, ఆయన భార్య వాణికి అనుమానం రేపింది.

మరి ఈ కళాకారుల కళాపోసన సిక్కోలు దాటి సోషల్‌మీడియా పుణ్యాన పెపంచకం మొత్తానికి తెలిసింది కాబట్టి.. మహిళా బాంధవుడయిన జగనన్నియ్య రంగంలోకి దిగి, మ్యాటర్ సెటిల్‌చేసి, తమ్ముడు శీను మందలిస్తారేమోనని జగనేయులు ఆశించారు. కానీ విచిత్రంగా జగనన్నియ్య.. తమ్ముడు శీనుకు అన్యాయం జరిగింది కాబటి,ట రాష్టంలో రాష్ట్రపతిపాలన పెట్టి ధర్నా చేయాలని డిసైడ్ అయ్యారట. ‘ఈ పత్తియాపారానికి మళ్లీ ధర్నాలు కూడానా’.. అని పార్టీలోని అక్కచెల్లెమ్మలు నోరెళ్లబెడుతున్నారట.

పైగా తమ్ముడు శీను, మాధురితో వైసీపీ బలోపేతంపై ‘చర్చిస్తున్న’ సమయంలో వారిద్దరికీ అక్రమ సంబంధం అంటకట్టడం దారుణమని, జగనన్నియ్య తన ప్రకటనలో బాధపడిపోయారు. అసలు సదరు మాధురి అనే కళాకారిణి.. ఈ పత్తేపారం ఇప్పటిది కాదని, చాలాకాలం నుంచి నడుస్తోందని మీడియా ముందే సెలవిచ్చింది.

‘శీను నాకు ఫ్రెండ్-గైడ్-ఫిలాసఫర్. మేమిద్దరం కలసి ఉంటున్నాం. నేను ఆత్మహత్య చేసుకోబోతే నన్ను కాపాడారు. నీకు నేను తోడుగా ఉంటానన్నారు. నాకూ-ఆయనకూ విడాకులు కాలేదు. మాది టెక్కలి-మీదీ టెక్కలే కాబట్టి ఆ ప్రకారంగా కలసి ఉంటున్నాం. మాది సహజీవనం కాదు. ‘అడల్టరీ’ అని ఎందుకు అనుకోరు? ఏదేమైనా నేను శీనుగారితోనే ఉంటా’ నని మాధురి చక్కటి తెలుగులోనే సెలవిచ్చింది.

దానితో నె టిజన్లు మాధురి అమ్మడు వాడిన, అడల్టరీ ఇంగ్లీషు పదానికి అర్ధమేమిటో అన్వేషిస్తే.. వ్యభిచారం-రంకు-కల్తీ/వ్యభిచారం అని గూగుల్‌మాత గుట్టువిప్పింది. నెటిజన్లు సేమ్ టు సేమ్ అదే కాపీని సోషల్‌మీడియాలో పేస్ట్‌చేసి, మాధురి ఇంగ్లీషు ప్రావీణ్యాన్ని తెగ మెచ్చేసుకుంటున్నారు. అది వేరే కథ. అసలు తమ్ముడి శీను కళాపోసనకు-రాష్ట్రంలో రాష్ట్రపతిపాలనకూ సంబంధం ఏమిటో వైకాయేయులకు అర్ధం కావటం లేదట.

జగనన్నియ్య చెప్పినట్లు. తమ్ముడు శీను-మరదలు మాధురి పార్టీ బలోపేతంపై ‘అంత సీరియస్‌గా’ చర్చిస్తున్నప్పుడు, గేట్లకు తాళాలెందుకు? శీను భార్య-కూతురు వచ్చి తలుపు పగలకొట్టేంత లెవల్లో శీను-మాధురి ఏం చర్చిస్తున్నారు? నాలుగేళ్ల తొమ్మిదినెలల తర్వాత, జగనన్నియ్యను ఎలా సీఎం చేయాలి? టెక్కలిలో ఎక్కడ సెక్రటేరియేట్ కట్టాలని చర్చిస్తున్నారా ఏంది బుల్లోడా’ అంటూ నెటిజన్లు తెగ పరాచాకాలాడుతున్నారు.

ఇంతకూ జగనన్నియ్య మద్దతు.. తమ్ముడు శీను అసలు భార్య వాణికా? కొసరుగా వచ్చిన కొత్త మరదలు మాధురికా? అన్నది అటు జగనేయులకూ అర్ధం కావడం లేదట. ఎందుకంటే తమ్ముడు శీను భార్య, జగనన్న ఒరిజినల్ మరదలు వాణి కూడా, వైకాపేయురాలే కాబట్టి!

దాని దుంపతెగ.. అదేంటో చిన్నప్పటి నుంచీ శ్రీకాకుళం జిల్లాలో మహిళాసేవకుల సంఖ్య ఎక్కువే. ఎన్టీఆర్-చంద్రబాబు క్యాబినెట్‌లో పనిచేసి, తర్వాత ‘ఫ్యాను’ కింద సేదదీరి.. మొన్నటి పాలనలో పెద్ద కుర్చీ ఉన్న ‘పెద్ద హోదా’లో పని చేసిన ఓ రాముడి కళాపోసన, అప్పట్లో పెద్ద సంచలనం. ఆయన భార్య స్వయంగా టీడీపీ అధినేత ఇంటికి వచ్చి, తన భర్త ఇంట్లో రామయ్య-వీధిలో కృష్ణయ్య అంటూ క్యాబినెట్ మీటింగుకు వచ్చిన, ప్రతి మంత్రికీ చెప్పేసిన వైనం, నాటి తెదేపాపేయులందిరకీ తెలిసిందే.సారుకు అప్పట్లో మహిళలకు విపరీతమైన సేవ చేసేవారన్న పేరుంది. ఇప్పుడు రాజకీయాల్లో వెలిగిపోతున్న మరికొందరు మహానేతలూ, కళాపోసకులే నన్నది బిహ రంగ రహస్యం. మరి సిక్కోలా? మజాకానా? అన్నట్లు.. ఆ జమానాలో మన లక్ష్మీపార్వతి కూడా సిక్కోలు నుంచే గెలిచిందండోయ్!

అసలు జగనేయుల కళాపోసనకు కళాప్రపంచమే నివ్వెరపోతోందట. ఒక ఎంపీ రెడ్డిగారే నా భార్యకు కడుపుచేసి, బిడ్డకు తండ్రయ్యాడని... ఒరిజినల్ మొగుడొచ్చి ధర్నా చేస్తాడు. సదరు ఎంపీగారేమో, నాకే పాపం తెలియ దంటారు. అలాగైతే డీఎన్‌ఏ టెస్టు చేయించు చూద్దామని, ఆ మొగుడుగారు సవాలు విసురుతారు. పార్టీకి ఏమిటీ అ‘శాంతి’ అని, వైకాపేయులు తలలు పట్టుకుంటున్నారు. సారు ఆవిధంగా ఉత్తరాంధ్రలో విశేషమైన మహిళా సేవలందించారట.

కొన్నేళ్లు టీటీడీని వెలిగించి, ఉత్తరాంధ్రను దున్నేసిన ఇంకో రెడ్డిగారు కూడా కళాపోసకుడేనన్నది జగనేయుల ఉవాచ. సారు టీటీడీని వెలిగించిన సమయంలో, ఒక మహిళకు ‘విశేష అర్చన’ చేసిన యవ్వారం గబ్బుయిదంట. అమ్మడు వాటిని వీడియోలో భద్రం చేసుకుని సారుకు చూపిస్తే.. కంగారుపడ్డ సారు, కొండ కింద ఉన్న ఇంకో ఎస్పీ రెడ్డిగారిని పిలిచి, అదేదో సెటిల్‌చేయమన్నారట. దానితో రంగంలోకి దిగిన ఎస్పీ రెడ్డిగారు సదరు మహిళను పిలిచి.. లెక్క సెటిల్‌చేసి, అటుంచి అటే విమానం ఎక్కించి విదేశాలకు పంపించారట. తర్వాత ఎస్పీ సారు ఇదంతా నిఘా దళపతికి చెబితే.. ఆ సారు జగనన్నియ్య చెవిలో ఊదారన్నది అప్పటి తాడేపల్లి కాంపౌండ్ టాక్.

ఈ సారుకు సైతం.. కులమత ప్రాంతాలకు అతీతంగా మహిళలకు విశేష సేవలందిస్తారన్న పేరు పార్టీలో బాగా ఉందట. ఇక అధికారం ఉన్నరోజుల్లో.. ఇద్దరు మంత్రుల గంట-అరగంట మహిళాసేవలన్నీ సోషల్‌మీడియాలోనే వచ్చినందున, మళ్లీ ఆ ముచ్చట అనవసరం.

ఇక ‘సలహా రెడ్డి’గారి మహిళా సేవల గురించి, అప్పట్లో తాడేపల్లి టు శ్రీకాకుళం వరకూ టామ్ టామయిపోయింది. సారు చలవ వల్ల మినిష్టర్లు అయిన వాళ్లూ ఉన్నారని, అప్పట్లో ‘సారు బాగా బిజీ’ అన్నది తాడేపల్లి కాంపౌండ్ నుంచి వినిపించిన వార్త.

అప్పట్లో ఇజయనగరం పెద్ద మంత్రి విదేశాలకు తీసుకెళ్లిన గుంటెవరంటూ అప్పట్లో సోషల్‌మీడియాలో ఓ వీడియో నానా చండాలం సేసేసినాది. లేటెస్టుగా మాచర్లలో మాజీ ఎమ్మెల్యే పిన్నెన్ని బంధువు, స్కూలు పిల్లలతో సరసాలాడుతుంటే, వాళ్ల తల్లులొచ్చి చీపుర్లతో బడితపూజ చేసిన వీడియోలు వైకాపాను గబ్బు పట్టించాయి. ఇలా చెప్పుకుంటూ పోతే జగనేయుల శృంగారకథలకు పేజీలు చాలవు.

ఇక వైసీపీ కోసం రెక్కలుముక్కలు చేసుకుని, ‘రాత్రింబవళ్లు శ్రమదానం’ చేసిన యూట్యూబర్, శ్రీరెడ్డి రెక్కలకష్టం గురించి ఎంత చెప్పినా తక్కువే. తనకు న్యాయం చేయాలంటూ అమ్మడు ఫిలింనగర్‌లో నిస్సిగ్గుగా ప్రదర్శించిన ‘విశ్వరూపం’.. ఆ తర్వాత జగనన్నకు మద్దతుగా చంద్రబాబు-పవన్-లోకేష్‌ను ఏకిపారేసిన శ్రీరెడ్డి శ్రమదానం గురించి, ఎంత చెప్పినా ఇంకా కొంత మిగిలే ఉంటుంది.

అతనికంటే ఘనుడు ఆచంట మల్లన్న అన్నట్లు.. పెద్ద సార్లు విరివిరిగా మహిళాసేవ చేయగా లేనిది, తామెందుకు చేయకూడదన్న స్ఫూర్తి అప్పటి వాలంటీర్లలోనూ రగిలింది. ఫలితంగా చాలామంది వాలంటీర్లు కూడా, మహిళా సేవ మొదలెట్టిన వైనం పోలీసులదాకా చే రిన కథ తెలిసిందే.

‘ఒంటరిగా ఉన్న మహిళలకు సేవ చేయాలన్న తపన’తో, పాపం వాలంటీరు తమ్ముళ్లు కేసులపాలయ్యారు. వాలంటీర్ల మహిళా సేవ గురించి జనసేనాధిపతి మీడియాకు చెబితే, వాలంటీర్లకు బోలెడు కోపమొచ్చి, హర్టయ్యారు. ఆయనపై మహిళాకమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దానికి స్పందించిన పద్మ మేడం కూడా, పవన్‌కు నోటీసులిచ్చిన యవ్వారం తెలిసిందే.

ఈవిధంగా జగనేయుల కళాతృష్ణ, అధికారం పోయిన తర్వాత కూడా చల్లారడం లేదు. దానికి జగనన్నియ్య కూడా తనవంతు ప్రోత్సాహం అందిస్తున్నట్లు తమ్ముడు శీను-మరదలు మాధురి ఎపిసోడ్‌తో తేలింది. ఎందరో శీనులు-అందరికీ వందనాలు!

కానీ ఈ ఎపిసోడ్‌లో దుర్మార్గ సోషల్‌మీడియా.. అప్పట్లో జగనన్న జనసేనాధిపతి పెళ్లిళ్లపై చేసిన విమర్శలు, దువ్వాడ శీనన్న పుణ్యాన మళ్లీ తెరపైకి వచ్చాయి. పెళ్లాలను మార్చడం ఏమిటని జగనన్న పాత ప్రశ్నకు.. లేటెస్టు దువ్వాడ దువ్వుడు యవ్వారం వీడియోలు పెట్టి, నెటిజన్లు జగనన్నను తెగ ఆడేసుకుంటున్నారు. నోరుజారాం.. మరేటిసేత్తాం?!

## అమెజాన్ వెబ్ సర్వీసెస్ విస్తరణ

(మొదటిపేజీ తరువాయి..)

ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ అమెజాన్‌తో చర్చలు విజయవంతమయ్యాయని ప్రకటించారు. ప్రభుత్వం తరఫున తగినంత సహకారంతో పాటు ఉత్తమమైన ప్రోత్సాహకాలు అందిస్తామని వారికి హామీ ఇచ్చినట్లు చెప్పారు. రాష్ట్రంలో భారీ విస్తరణకు కంపెనీ ముందుకు వస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.

అమెజాన్ వెబ్ సర్వీసెస్ వైస్ ప్రెసిడెంట్ కెర్రీ పర్సన్ మాట్లాడుతూ, హైదరాబాద్‌లో తమ క్లౌడ్ సదుపాయాలను మరింత విస్తరించే అవకాశాలపై ఆనందం వ్యక్తం చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో అమెజాన్ వెబ్సర్వీసెస్ క్లౌడ్‌సేవల వృద్ధికి హైదరాబాద్ కీలక పాత్ర పోషిస్తుందనే అభిప్రాయం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం డిజిటల్ వృద్ధిలో ఆశించిన లక్ష్యాలను అందుకునేందుకు తమ కంపెనీ భాగస్వామ్యం తప్పకుండా ఉంటుందన్నారు.



## ఫైనాన్స్ డిపార్టుమెంటులో 8 శాతం కమీషన్లు

(మొదటిపేజీ తరువాయి..)

పార్టీకి లేకుండా చేయాలని కుట్ర చేస్తున్నాయి. సుంకిశాల ప్రాజెక్టు ప్రమాదంపై ప్రభుత్వం ఇప్పటి వరకు స్పందించలేదు. సుంకిశాల ప్రాజెక్టు ఏజెన్సీని బ్లాక్ లిస్ట్ లో పెట్టాలని కేటీఆర్ కోరినా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

సుంకిశాల ప్రాజెక్టు ప్రమాదం సోషల్ మీడియా ద్వారా మా దృష్టికి వచ్చినట్లు ప్రభుత్వం చెప్పడం సిగ్గుచేటు. ప్రాజెక్టులో ఏం జరుగుతుందో ప్రభుత్వం తెలుసుకోలేక పోయింది. మంత్రులు మాట్లాడుతున్న మాటలకు పొంతన లేకుండా పోయింది.

సుంకిశాల ప్రాజెక్టు ప్రమాదంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఎందుకు మాట్లాడలేదు? రైతు రుణమాఫీ డిసెంబర్ 9వ తేదీ లోపు చేస్తామని చెప్పి ఇప్పుడు అరకొరగా రుణమాఫీ చేస్తున్నారు.

రైతు భరోసా ఇప్పటి వరకు ప్రభుత్వం ఇవ్వలేదు. ఇలాంటి సమస్యలపై మాట్లాడేందుకు బీజేపీ నేతలకు సమయం లేదు.ఆరు గ్యారెంటీలపై బీజేపీ నేతలు ఎందుకు అడగడం లేదు? నిరుద్యోగుల సమస్యలపై బిజెపి నేతలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించరు.

ఫైనాన్స్ డిపార్ట్మెంట్‌లో 8శాతం కమీషన్‌తో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపు తప్పాయి. రాష్ట్రంలో శాంతిభద్రతలపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ నోరు మెదపడం లేదు.

బిఆర్ఎస్ హయాంలో కేవలం ఆరు లక్షల ఉద్యోగాలు ఐటీ సెక్టార్ లో వచ్చాయి.

రాష్ట్రంలో ఉన్న కంపెనీలు ఇతర రాష్ట్రాలకు వెళ్లకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. కొడంగల్‌లో రైతుల భూములు లాక్కుంటున్నారని ఆందోళన చేస్తున్నారు

బండి సంజయ్ రేవంత్ రెడ్డికి కోవర్టుగా పని చేస్తున్నారు. బండి సంజయ్ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా కాకుండా రేవంత్ రెడ్డికి సహాయ మంత్రిగా పని చేస్తున్నారు.

బండి సంజయ్ వ్యాఖ్యలపై మోడీ,అమిత్ షాకు లేఖ రాస్తాము. తమ్ముడి కంపెనీతో రేవంత్ రెడ్డి ఎట్లా ఒప్పందాలు చేసుకుంటారు? బండి సంజయ్‌కు రాజ్యాంగంపై అవగాహన ఉందా?

కాంగ్రెస్,బీజేపీ మైత్రి బంధం అసెంబ్లీ,పార్లమెంట్ ఎన్నికల్లో బయటపడింది. అసెంబ్లీ సమావేశాల్లో బీజేపీ ఎమ్మెల్యేలను రేవంత్ రెడ్డి మెచ్చుకున్నారు. కాంగ్రెస్,బీజేపీ పార్టీ ఢిల్లీలో కుస్తీ గల్లీలో కుస్తీ. రేవంత్ రెడ్డి గతంలో బీజేపీలో పని చేశారు.

కాంగ్రెస్,బీజేపీ పార్టీలకు చెరో ఎనిమిది ఎంపీ స్థానాలు ఇస్తే తెలంగాణకు ఏం తెచ్చారు? కేటీఆర్‌ను ఎందుకు అరెస్టు చేయాలో బండి సంజయ్ చెప్పాలి.

హైదరాబాద్ నగరాన్ని అభివృద్ధి చేసినందుకు కేటీఆర్‌ను అరెస్టు చేయాలా? కేటీఆర్ ను అరెస్టు చేయాలని బండి సంజయ్ రేవంత్ రెడ్డికి ఆదేశాలు ఇస్తున్నారు.

కాంగ్రెస్, బీజేపీ కలిసి కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నాయి. తెలంగాణలో కక్షపూరిత రాజకీయాలు చేయాలని చూస్తున్నారు. కేసీఆర్ పెద్ద,పెద్ద నాయకులను ఎదుర్కొన్నారు. ఇప్పుడు ఉన్న నాయకులు కేసీఆర్ కాలిగోటికి సరిపోరు. ఢిల్లీకి కప్పం కట్టడానికే సీఎం సమయం సరిపోతుంది. మోదీని బడే భాయ్ అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

హైదరాబాద్ నగరంలో పారిశుద్ధ్యం లోపించింది. హైదరాబాద్ నగరానికి బ్రాండ్ ఇమేజ్ ఉంది. హైదరాబాద్ నగరంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపు తప్పాయి. ఓల్డ్ సిటీలో రోజుకో మర్డర్ జరుగుతోంది. కరెంటు కోతలు విధిస్తున్నారు. దోమలతో డెంగ్యూ జ్వరాలు విజృంభిస్తున్నాయి.

కుక్క కాట్లతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం ఉందా? లేదా అనేది అర్థం కావడం లేదు. జిహెచ్ఎంసీ నియంత్రణ కోల్పోయింది.

## కరోనా మళ్ళీ వచ్చింది

(మొదటిపేజీ తరువాయి..)

ఆరోగ్య సంస్థ డాక్టర్ వాన్ కెరోవ్ జెనీవాలోని ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో తెలిందింది. కరోనా కేసుల పాజిటివిటీ ఒక్కో ప్రాంతంలో ఒక్కోలా ఉందన్నారు. ఈసారి తీవ్రమైన పరిణామాలు వస్తాయని ఆమె అన్నారు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ విడుదల చేసిన నివేదిక ప్రకారం.. అమెరికా, యూరప్ మరియు పశ్చిమ పసిఫిక్‌లలో కొత్త ఇన్ఫెక్షన్ కేసులు నమోదయ్యాయి. గత 18 నెలలుగా కోవిడ్ వ్యాక్సిన్ల లభ్యత బాగా తగ్గిందని డాక్టర్ వాన్ కెరో వ్ చెప్పింది. కోవిడ్ 19ని ఈ సారి సమర్థవంతంగా ఎదుర్కోడానికి ఆయా దేశాలు చర్యలు తీసుకోవాలని హెచ్చరిస్తున్నారు.

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ‖ సోమవారం 12, ఆగస్టు 2024

## ఉన్నత ఆలోచనలతోనే అద్భుతమైన విజయాలు

- 25 శాతం మంది విద్యార్థులకు ఉచిత విద్య, నైతిక విధానంబోధనా అంశంగా ఉండడం గొప్ప విషయం
- పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చు అనేదానికి మోహన్ బాబు నిదర్శనం
- తిరుపతిలోని మోహన్‌బాబు యూనివర్సిటీ మొదటి స్నాతకోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



**తిరుపతి,మహానాడు:**
టీం స్పిరిట్‌తో మనం ఎంతమందిని ముందుకు తీసుకు పోగలుగుతున్నాం అన్న ఆలోచన ఉన్నతంగా ఉన్నప్పుడు మీరు అద్భుత విజయాలు సాధిస్తారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఆదివారం ఆయన తిరుపతిలోని శ్రీ సాయినాథ్ నగర్ లో ఏర్పాటుచేసిన మోహన్ బాబు యూనివర్సిటీ మొదటి స్నాతకోత్సవంలో ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించి అనంతరం విద్యార్థులకు గ్రాడ్యుయేట్



పట్టాలు అందించారు.

గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న ప్రతి విద్యార్థికి అభినంద నలు తెలిపారు. ఇంతకాలం తల్లిదండ్రులు ఆర్థికంగా సపోర్ట్ చేయడంతో మీ విద్యాభ్యాసం కొనసాగింది.. ఇకనుంచి మీ జీవితంలో కొత్త అధ్యాయాలు ప్రారంభమవుతాయి. మీ మీద తల్లిదండ్రులు మా అందరి కోరిక మేరకు జాతి భవిష్యత్తుకు గొప్పగా ఉపయోగపడాలి మీరు విజయాలు సాధించాలని కోరుకుంటున్నట్టు తెలిపారు.

మీరు సాధించిన సర్టిఫికెట్లతో ఏ స్థానంలో ఉన్న మీతో పాటు పదిమందికి ఉపయోగపడేలా మీ జీవితం ఉండాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. ఒక్కడిగా బతకడం గొప్ప విషయం కాదు మనం బతుకుతూ 10 మందిని బతికించడం చాలా గొప్ప విషయం అన్నారు.

పోటీ ప్రపంచంలో ఎదుటివారిని ఓడించడం కష్టమైన పని కాదు... ఎదుటివారిని ఓడించి గెలవడం ఒకటే ముఖ్యం కాదు. ఎదుటివారి మనసు గెలవడం ముఖ్యం మనం ఎంతమంది ఎదుటివారి మనసు గెలుస్తున్నాం, టీం స్పిరిట్ తో మనం ఎంతమందిని ముందుకు తీసుకుపోగలుగు తున్నాం అన్న ఆలోచన మీకు అద్భుత విజయాలను సాధించి పెడుతుందని హితబోధ చేశారు.

మీతో పాటు పనిచేసే, మీ కింద పనిచేసే వారు సరైన మార్గాల్లో నడిపిస్తూ వాళ్ల గెలుపునకు ఇచ్చే సూచనలు మీ గెలుపునకు దోహదం చేయడమే కాదు వారి గెలుపులో మీ గెలుపు తోడ్పడుతుంది అని భావిస్తే గొప్ప విజయాలు సాధిస్తారని తెలిపారు. మోహన్ బాబు యూనివర్సిటీని మొదటిసారి సందర్శించాను. ఇప్పటివరకు వినడమే కానీ చూడలేదు.

అద్భుతంగా ఒక మానస సరోవరంలా ఉంది. నైతిక విధానం ఎలా ఉండాలో ప్రతి విద్యార్థికి విద్యాబోధనలో భాగంగా చేయడం అభినందనీయం. ప్రొఫెసర్ కి, టీచర్ కి విద్యార్థికి మధ్య పర్సనల్ బ్యాండేజ్ లేకుండా పోతున్న సమయంలో ఇక్కడ అందించేది కేవలం పర్సనల్ బ్యాండేజ్ అని తెలుసుకొని సంతోషిస్తున్నాను. భారతీయ సంస్కృతిలోని గురుకులాల బాండేజ్ విధానం ఉన్న యూనివర్సిటీ మొదటి స్నాతకోత్సానికి నేను ముఖ్య అతిథిగా రావడం అదృష్టంగా భావిస్తున్నాను అన్నారు.

ఎన్ని విజయాలు సాధించిన గతాన్ని మర్చిపోకుండా వ్యవస్థలో లోపాలు సరిదిద్దుకుంటూ మోహన్ బాబు గారు ముందుకు వెళ్తున్నారు. భారత రాజ్యాంగంలోని సమానత్వం, సౌభ్రాతృత్వం అంశాలను ముందుకు తీసుకుపోయేందుకు మోహన్ బాబు ప్రయత్నిస్తున్నారని అభినందించారు. జీవి తంలో అనేక రంగాల్లో నైపుణ్యం సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలి అనుకునే వారికి మోహన్ బాబు జీవితం యూని వర్సిటీ లాంటిది అన్నారు. 25 శాతం మంది విద్యార్థులకు ఉచితంగా అడ్మిషన్స్ ఇచ్చే గొప్ప కార్యక్రమాన్ని మోహన్ బాబు మొదటి నుంచి పెట్టుకుని ముందుకు తీసుకు పోవడం అభినందనీయం అన్నారు.

సినీ, విద్యా రంగాల్లో ఆయన సామాజిక బాధ్యతను గొప్పగా నిర్వహిస్తున్నారని తెలిపారు. విలన్‌గా, కథానాయ కుడిగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా అన్ని విభాగాల్లో సీనియర్ ఎన్టీఆర్ తర్వాత నటుడిగా అంత గొప్ప పేరు మోహన్ బాబు సాధించారని గుర్తు చేశారు.

సినీ ఇండస్ట్రీలో బిజీగా ఉన్నప్పటికీ దానికి పూర్తిగా భిన్నమైన విద్యా వ్యవస్థను ఎంపిక చేసుకొని పాఠశాల నుంచి యూనివర్సిటీ వరకు అభివృద్ధి చేసి సాధించడం ద్వారా సినీ నటుడు మోహన్ బాబు మనందరికీ ఆదర్శంగా నిలిచారని తెలిపారు. పీఈటిగా జీవితాన్ని మొదలుపెట్టి మోహన్ బాబు పద్మశ్రీ స్థాయికి ఎదగడం వెనుక గొప్ప కృషి దాగి ఉందని అన్నారు.

## సామాన్యుడి ప్రాణాన్ని కాపాడిన హెూమ్ మంత్రి అనిత కాన్వాయ్

- పోలీస్ డ్రైవర్ అప్రమత్తత
- ఏలూరు జిల్లా కైకరం జాతీయ రహదారిపై ఘటన

**ఏలూరు జిల్లా,మహానాడు:**
రాష్ట్ర హెూమ్ మంత్రి వంగలపూడి అనిత ప్రయాణి స్తున్న కాన్వాయ్ ఎస్కార్ట్ డ్రైవర్ అప్రమత్తతతో ఓ సామాన్యుడి నిండు ప్రాణానికి ప్రమాదం తప్పింది. ఏలూరు జిల్లా జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం హెూమ్ మంత్రి అనిత ప్రయాణిస్తున్న కాన్వాయ్ కైకరం వద్దకు చేరే సరికి రోడ్డు పక్కన వెళ్తున్న ఓ ద్విచక్ర వాహన దారుడు అదుపుతప్పి ఒక్కసారిగా కుడి వైపు వెళ్తున్న కాన్వాయ్ వైపు ఒరిగి పడిపోయాడు.

అయితే క్షణ కాలంలో జరిగిన ఘటనతో వెంటనే అప్రమత్తం ఆయిన హెూమ్ మంత్రి ఎస్కార్ట్ డ్రైవర్ ద్విచక్ర వాహనదారుడికి ఎలాంటి ప్రమాదం జరగకుండా ఉండాలని, తమ పోలీస్ వాహనాన్ని పక్కకు తప్పించి, సడెన్ బ్రేక్



వేశారు.. దీంతో కాన్వాయ్ మొత్తం ఒక్కసారిగా ఆగింది. ఆ ఘటనలో హెూమ్ మంత్రి అనిత ప్రయాణిస్తున్న కారును మరో కార్ స్వల్పంగా ఢీ కొట్టగా, మంత్రి ప్రయాణిస్తున్న కారు బంపర్ స్వల్పంగా డ్యామేజ్ అయింది.

అకస్మాత్తుగా జరిగిన ఘటనతో ఏమి జరిగిందా అని అందరూ ఒకింత ఆందోళన చెందగా, అనంతరం విషయం తెలుసుకుని, సామాన్యుడి ప్రాణానికి, కాన్వాయ్ లోని హెూమ్ మంత్రి అనితకు ఎలాంటి ప్రమాదం జరగపోవ టంతో పోలీస్ భద్రతా సిబ్బంది అంతా ఊపిరి పీల్చుకు న్నారు. అనంతరం పోలీస్ సిబ్బంది ద్విచక్ర వాహన దారుడిని క్షేమంగా పక్కకు తీసుకువెళ్లారు. హెూమ్ మంత్రి అనిత వేరే కార్‌లో బయలుదేరి వెళ్ళిపోయారు.

## రాష్ట్రం బాధ్యత ప్రజలదంటూ నైజాన్ని బయటపెట్టారు

- ఇచ్చిన హామీలనుంచి తప్పించుకునే ప్రయత్నం
- సూపర్ సిక్స్ సహా ఇచ్చిన హామీలను తు.చ. తప్పక అమలు చేయండి
- సీఎం చంద్రబాబుపై వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌ఫైర్



**విజయవాడ, మహానాడు:** ఎన్నికలప్పుడు ఈ రాష్ట్రం బాధ్యత నాది అన్నారు. పైపెచ్చు రాష్ట్రానికి రూ.14లక్షల కోట్ల అప్పులున్నాయని, అయినా సంపద సృష్టిస్తానని, హామీలకు గ్యారెంటీ నాదే అని పదేపదే చెప్పారు. తీరా అధికారంలోకి వచ్చాక రాష్ట్రం బాధ్యత ప్రజలదంటూ నైజాన్ని బయట పెట్టారు. ఇచ్చిన హామీలనుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇది పచ్చిమోసం కాదా?

చంద్రబాబూ ప్రమాణస్వీకారం చేసిన తొలి క్షణంనుంచే మీరు ప్లేటు ఫిరాయించారు. ఖజానా ఖాళీ అయిపోయిం దంటూ తప్పుడు శ్వేతపత్రాలు జారీచేసి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేశారు. అప్పులకు వడ్డీలుకట్టాలి, అవి కట్టడానికే డబ్బుల్లేవు అంటూ సన్నాయి నొక్కులు నొక్కుతూ లేని అప్పులు ఉన్నట్టుగా, వాటికి లేని వడ్డీలు కడుతున్నట్టుగా పదే పదే మాట్లాడి ప్రజలను మాయచేసే ప్రయత్నంచేస్తున్నారు.

తల్లికి వందనం కింద స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి రూ.15వేలు ఇవ్వలేదు, రైతు భరోసాకింద ప్రతి రైతుకు రావాల్సిన రూ.20వేలు రాలేదు, ఫీజు రియింబర్స్‌మెంట్ కింద రెండు త్రైమాసికాల డబ్బులు పెండింగ్, వసతి దీవెనా లేదు, సున్నావడ్డీ లేనే లేదు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి అక్క చెల్లెమ్మకూడా నెల రూ.1500 చొప్పున ఏడాదికి రూ.18వేలు జాడే లేదు. ప్రతి ఇంటికీ ఉద్యోగం లేదా రూ. 3వేల నిరుద్యోగ భృతి ఊసే లేదు. చివరకు రూ.20వేలు ఇస్తానన్న మత్స్యకార భరోసా అడ్రస్సే లేదు.

పేదలకు అత్యవసరమైన ఆరోగ్యశ్రీ చెల్లింపులు రూ.1600 కోట్లు పెండింగ్. ఇంటికి వచ్చి పెన్షన్ ఇచ్చే విధానం ఆగిపోయింది. ఇంటికి వచ్చే రేషన్ నిలిచిపోయింది. వాలంటీర్లను మోసం చేశారు, విత్తనాలకోసం రైతులు క్యూలో నిలబడే పరిస్థితిని తీసుకు వచ్చారు. పంటలకు ఉచిత బీమా ఎగరగొట్టారు. బడుల్లో టోఫెల్ పీరియడ్ రద్దుచేశారు. విద్యా కానుక కిట్లు పంపిణీ అరకొరగానే, అదికూడా అస్తవ్యస్తం.

మధ్యాహ్న భోజనం పథకంలో రోజుకో మెనూ పద్ధతిపోయింది. ఇంగ్లీష్ మీడియం గాడితప్పింది, బడుల్లో, గ్రామాల్లో పరిశుభ్రత పడకేసింది. లా అండర్ ఆర్డర్ పూర్తిగా గాడితప్పింది. రెడ్‌బుక్ రాజ్యమేలుతోంది. రాష్ట్రం మూడు హత్యలు, ఆరు విధ్వంసాలుగా వర్ధిల్లుతోంది. మహిళలకు రక్షణే లేదు. దిశయాప్ అటకెక్కింది. రెండున్నర నెలల్లోనే ప్రజలను ఇంతలా దగాచేస్తారా చంద్రబాబూ?

ఎన్నికలకు ముందు రూ.14 లక్షల కోట్లమేర రాష్ట్రం అప్పులపాలైందని, శ్రీలంక అయిపోయిందని, ఆర్థిక విధ్వంసం జరిగిందని మీరు ఊరూరా విష ప్రచారం చేశారు. అయినా సరే అపార అనుభవం ఉంది, నన్ను మించినవారు లేరు, అమలు చేసే బాధ్యత నాదీ అని, సూపర్ సిక్స్ అంటూ సూపర్ టెన్ అంటూ చాలా చాలా వాగ్దానాలు చేశారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక రాష్ట్రం అప్పులు రూ.10 లక్షల కోట్లు అంటున్నారు. అదికూడా అసత్యమే అయినా సాక్షాత్తూ గవర్నర్‌గారితో అసెంబ్లీలో ఇలాంటి అనేక అవాస్తవాలను చెప్పించారు.

నిజాలు ఏంటంటే.. రాష్ట్ర ప్రభుత్వం రుణాలు, విద్యుత్ కంపెనీల రుణాలతో కలిపి, గ్యారంటీ రుణాలు, నాన్ గ్యారంటీ రుణాలు ఇవన్నీ జూన్ 2024నాటికి ఉన్న మొత్తం అప్పులు అక్షరాల రూ.7,48,612కోట్లు. ఇందులో 2019లో మీరు దిగిపోయేనాటికి ఉన్న అప్పులు రూ.4,08,170 కోట్లు. దీనికిపైన ఉన్నవి మాత్రమే మా హయంలో చేసిన అప్పులు.

మీ హయాంలో అప్పుల వృద్ధిరేటు (సీఏజీఆర్) 21.63శాతం అయితే, కోవిడ్ కారణంగా ఆర్థికవ్యవస్థలో మహా సంక్షోభం వచ్చినా, మా హయాంలో అది కేవలం 12.9 శాతం. ఈ వాస్తవాలన్నింటినీకూడా గవర్నర్‌గారికి లేఖ రూపంలో తెలియజేశాం. అందులో కేంద్ర ప్రభుత్వ ప్రకటనలు, ఆర్బీఐ నివేదికలు, కాగ్ లెక్కల్లాంటి ఆధారాలతో కూడిన సమగ్ర వివరాలు ఈ లింక్ bit.ly/4dkOKruలో ఉన్నాయి. జాగ్రత్తగా చదువుకోండి చంద్రబాబు.

ఇకనైనా రాష్ట్రంలో హత్యలు, విధ్వంసాలను ఆపేసి, అబద్ధపు లెక్కలతో ప్రజలను మోసంచేయడం మాని, సూపర్ సిక్స్ సహా ఇచ్చిన హామీలను తు.చ. తప్పక అమలు చేయండి. ఇప్పటికే దిగజారిన పాలనను గాడిలో పెట్టండి..

## 70 ఏళ్లు 70 అడుగులు

- సప్తముఖ గణేశుడి రూపంలో దర్శనం

**హైదరాబాద్,మహానాడు:**
గతేడాది రికార్డు సృష్టించిన ఖైరతాబాద్ గణేశుడు.. ఈసారి కూడా తన రికార్డును తానే బ్రేక్ చేసేందుకు సిద్ధమవుతున్నాడు. సప్తముఖ గణేశుడి రూపంలో ఈసారి కొలువుదీరబోతున్నాడు. 70 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా.. 70 అడుగుల ఎత్తులో గణనాథుడు ముస్తాబవుతున్నాడు.

ఈసారి కొలువుదీరే గణేశుని ప్రత్యేకతలు ఏంటో ఇప్పుడు చూద్దాం.. హైదరాబాద్‌లో ది ఫేమస్ ఖైరతాబాద్ వినాయకుడి విగ్రహ తయారీ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇక్కడి లంబోదరుడికి సెపరేట్ ఫ్యాన్ బేస్ ఉంటుంది. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ నలుమూలల నుంచి భక్తులు తరలి వస్తుంటారు. అయితే ఖైరతాబాద్ గణేషుడు రికార్డ్‌లకు కేరాఫ్‌గా మారాడు. ఈసారి కూడా హైట్‌లో తన పేరు మీదున్న రికార్డును తానే బ్రేక్ చేసేందుకు సిద్ధమవుతున్నాడు.

70 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా.. 70 అడుగుల



ఎత్తులో ఈ ఏడాది సప్తముఖ గణేశుడిరూపంలో దర్శనమివ్వను న్నాడు. గతేడాది (2023) పూర్తి మట్టితో 63 అడుగుల అత్యంత ఎత్తైన విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రపంచ రికార్డ్ నెలకొల్పారు. గత సంవత్సరం కంటే 7 అడుగులు ఎక్కువ ఎత్తుతో కమిటీ నిర్వహ కులు మొత్తం 70 అడుగుల ఎత్తుతో నిర్మిస్తున్నారు.

## ప్రతి రైతుకు గిట్టుబాటు ధర అందించడమే ధ్యేయం

- ఎంపీ పుట్టా మహేష్ కుమార్



**ఏలూరు, మహానాడు:**
ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టు అన్ని రకాల పంటలు పండించే రైతులకు గిట్టుబాటు ధర అందించడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్టు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. దేవరపల్లిలో జరిగిన పొగాకు రైతుల అవార్డుల వేడుకలో ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కు రైతులు వారి సమస్యలు చెప్పగా తక్షణం స్పందించిన ఎంపీ.. ఢిల్లీలో కేంద్ర కామర్స్ మినిస్టర్‌ను కలిసి రైతులు అదనంగా పండించిన పొగాకు పంటపై ఫెనాల్టీ రద్దు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం అదనంగా పండించిన పొగాకు పంటకు ఫెనాల్టీ రద్దు చేస్తూ జీవో విడుదల చేసింది. ఈ సందర్భంగా రైతులు ఏలూరు వచ్చి ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌ను ఘనంగా సత్కరించారు.

పొగాకు రైతు సంఘాల అధ్యక్షుడు పరిమి రాంబాబు, కరాటం రెడ్డి నాయుడు, కాకర్ల వివేకానంద లు మాట్లాడుతూ ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కృషి వలన జిల్లాలో ఉన్న 15 వేల మంది పొగాకు రైతులు 15 కోట్లు, రాష్ట్రం లో ఉన్న లక్ష మంది పొగాకు రైతులు 110 కోట్లు లబ్ది పొందామన్నారు. ప్రతి ఏడాది దేశానికి 25 వేల కోట్లు నష్టం కలిగిస్తున్న నకిలీ సిగరెట్ల అక్రమ దిగుమతులను అరికట్టాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడారు. ఏ పని పట్టుకున్నా, అయేవరకు వదిలిపెట్టనన్నారు. రైతులను గుండెల్లో పెట్టుకుంటానని అన్నారు. నిన్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని కలిశాను. రైతులకు గిట్టుబాటు ధర, యువతకు ఉపాధి, పోలవరం నిర్మాణం వేగవంతం, పోలవరం నిర్వాసితులకు న్యాయానికి చేయాలని అడిగానన్నారు.

త్వరలో జరగనున్న కేంద్ర కేబినెట్ మీటింగ్‌లో పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి 12 వేల కోట్ల రూపాయల మంజూరు చేస్తు న్నారని అన్నారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో యువతకు ఉపాధి, రైతులకు గిట్టుబాటు ధర, పోలవరం, రైల్వే ప్రాజెక్టుల గురించి, మాట్లాడాను. ఏలూరుకు వందేభారత్ నిలుపు దల గురించి అడిగాను. సెప్టెంబర్ నెలలో ఏలూరులో జాబ్ మేళా నిర్వహిస్తామని ఎంపీ తెలిపారు.

ఈ సమావేశంలో మాజీ శాసన సభ్యులు ఘంటా మురళీ, పొగాకు రైతు నాయకులు సత్రం వెంకట్రావు, కాకర్ల శేషుబాబు, జిల్లా నలుమూలల నుండి వందలాదిగా కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## జనగణమన గానంతో గిన్నిస్ రికార్డు!

**ఒడిశా:** మ్యూజిక్ కంపోజర్, మూడు గ్రామీ అవార్డుల విజేత రికీ కేజ్ అరుదైన ఘనత సాధించారు. ఒడిశాలో 14,000 మంది గిరిజన విద్యార్థులతో కలిసి 'లార్జెస్ట్ సింగింగ్ లెసన్' పేరిట జాతీయ గీతం జనగణమన గానంతో గిన్నిస్ రికార్డుల్లో చోటు సంపాదించారు.

ఈ రికార్డింగును ఈ నెల 14న సాయంత్రం అయిదు గంటలకు విడుదల చేస్తామని ఆయన తెలిపారు. వేణు గాన విద్వాంసులు హరి ప్రసాద్ చౌరాసియా, రాకేశ్, వీణ మాస్ట్రో జయంతి తదితరులు ఇందులో భాగమయ్యారు.




## డబ్బు ప్రజలది... విలాస జీవితం జగన్‌ది!

- టీడీపీ నేత బుద్దా వెంకన్న విమర్శ

**విజయవాడ, మహానాడు:**
ప్రజల డబ్బుతో జగన్ విలాసవంతమైన జీవితం గడిపారని టీడీపీ నేత బుద్దా వెంకన్న ఘాటుగా విమర్శించారు. ఇంకా.. ఆయన ఏమన్నారంటే.. పట్టుమని రెండు నెలలు కూడా పూర్తి కాలేదు పదవి పోయి.. అప్పుడే మతి భ్రమించి.. ఏం చేస్తున్నాడో కూడా అతనికి తెలియడం లేదు.. అంబేద్కర్ విగ్రహం పెట్టి కేవలం తన పేరే పట్టుకున్నాడు. అంబేద్కర్ పేరు కన్నా జగన్ పేరు పెద్దదిగా ఉంది. అందుకే అంబేద్కర్ అభిమానులు జగన్ పేరు తొలగించి ఉండవచ్చు.



జగన్ తన పాలనలో రాజారెడ్డి రాజ్యాంగం అమలు చేశారు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని అవమానించిన వ్యక్తి జగన్. ఇప్పుడు వైసీపీ నేతలు ఏదో జరిగిపోయినట్టు అబద్దాలు ప్రచారం చేస్తున్నారు. గతంలో అమరావతిలో అంబేద్కర్ విగ్రహం పెట్టాలని చంద్రబాబు నిర్ణయించారు. జగన్ వచ్చాక 404 కోట్లతో విజయవాడ లో అంబేద్కర్ విగ్రహం పెట్టారు. ఇందులో కూడా 226 కోట్లు కొట్టేసిన ఘనుడు జగన్. అంబేద్కర్ విగ్రహాలకు కూడా వైసీపీ రంగులు వేశారు. అంబేద్కర్ ను అడుగడుగునా అవమానించిన వ్యక్తి జగన్. అంబేద్కర్ మద్యం మాన్పించాలని చెబితే .. జగన్ మద్యం ఏరులై పారించాడు. మద్య నిషేధం అని ఓట్లు వేయించుకుని.. మద్యంతో కోట్లు దోచారు. సంపద సృష్టించమని అంబేద్కర్ చెబితే... ఉన్న సంపదను కొల్లగొట్టారు జగన్. అమర్ రాజా వంటి ఎన్నో పరిశ్రమలు ను బయటకి పంపారు. మీడియాకు, ప్రజలకు స్వతంత్రంగా చెప్పుకునే స్వేచ్ఛ ఇచ్చావా? నీ దెబ్బకి పారిశ్రామిక వేత్తలు ఏపీకి రావాలంటే భయపడిపోయారు.

అమరావతిలో అంబేద్కర్ విగ్రహం కట్టి తీరతాం.. ఇప్పుడు ట్విట్టర్‌లో రెచ్చగొట్టే పోస్టలు పెట్టి రాక్షస ఆనందం పొందు తున్నారు. సంపద సృష్టి లేకుండా అభివృద్ధి ఎలా జరుగుతుందో కూడా జగన్ తెలియదు. చంద్రబాబు సారథ్యంలో ఏపీ అభివృద్ధి ఎలా ఉంటుందో చూపుతాం. జగన్ మళ్లీ వచ్చి ఉంటే రోబోలను పెట్టుకుని ప్రజలను తరిమి కొట్టేవారు. కులాల చిచ్చు పెట్టి వచ్చే పరిశ్రమలను ఏపి రాకుండా జగన్ కుట్ర చేస్తున్నారు. చంద్రబాబు విజన్, పాలనా దక్షత ముందు నువ్వు, నీ తాత ఆటలు సాగవు. జగన్ ఇప్పుడు అయినా రాష్ట్ర అభివృద్ధికి సహకరించు.. అడ్డు కునేలా కుట్ర చేస్తే ఈసారి ప్రజలే నిన్ను తరిమి కొడతారు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

4

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || సోమవారం 12, ఆగస్టు 2024


## తరం వెళ్ళిపోతున్నది..

● ఆ ప్రేమ.. కనుమరుగై పోతున్నది

(వెంకటాచారి)

తరం వెళ్ళిపోతుంది.. ప్రేమ గల పెద్దరికం కనుమరుగై పోతుంది. బహుదూరపు బాటసారై పయనం ముగిస్తున్నది. జ్ఞాపకాల మూట వదిలి బాట పట్టి పోతుంది. తెల్లని వస్త్ర ధారణతో.. స్వచ్ఛమైన మనసుతో.. మధురమైన ప్రేమతో.. అందరి పట్ల అనురాగంతో విలువలతో కూడిన బ్రతుకును సాగించిన.. మన ముందు తరం తిన్నగా చేజారి పోతున్నది. వయో భారంతో మనల్ని వదిలి పోతుంది.

హుందాతనపు మీస కట్టు.. రాజహాసపు పంచ కట్టు.. పూటకో తీరు మార్చని మాట కట్టు.. శ్రమనే నమ్ముకుని ఎక్కిన బ్రతుకు మెట్టు.. తల తెగిన తప్పని నీతి ఒట్టు.. ఇబ్బందులు ఎన్ని ఎదురైనా విప్పని గుట్టు.. ఇలా నిజాయితీకి మారుపేరుగా నిలిచిన ఒక నాటి మన పెద్ద తరం క్రమంగా కనుమరుగు అవుతుంటే.. హృదయం బరువెక్కుతుంది. మనసు మూగబోతుంది. కంట నీరు



కారి పోతుంది. ఆర్థిక ఇబ్బందులు ఎన్ని ఉన్నా..

కష్టాలు ఎన్ని చుట్టు ముట్టినా.. సమస్యలు ఎన్నో ఎదురైనా.. అందరూ సామరస్యంగా.. కలిసి మెలిసి.. ఒకరి కష్టాన్ని ఒకరు పంచుకునే వారు.

ఒకరికొకరు సహకరించుకునే వారు. అందరి కోసం ఒకరు, ఒకరి కోసం అందరూ ఆ తరం కనుమరుగు అవుతున్నది.

## మానసిక ఆరోగ్యానికి క్రీడలు ఎంతో ముఖ్యం

● ఎమ్మెల్యే అరవింద బాబు

నరసరావుపేట, మహానాడు: క్రీడల ద్వారానే మనలో మానసిక ఆరోగ్యం,శారీరక సామర్థ్యం మెరుగుపడుతుందని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. నరసరావుపేట మండలం కేసానుపల్లి గ్రామంలో ఎంఎఎం కాలేజి ఆవరణలో ఏర్పాటు చేసిన ఏపీ స్టేట్ ఓపెన్ చెస్ టోర్నమెంట్ ను ప్రారంభించారు. రాష్ట్రంలోని పిల్లలకు క్రీడా స్ఫూర్తి పెంచే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. క్రీడలతో మాత్రమే మానసిక ఎదుగుదల సాకారం అవుతుందని, ఇలాంటి కార్యక్రమాల నిర్వహణకు ప్రతి సంస్థా ముందుకు రావాలని ఎమ్మెల్యే అరవింద



బాబు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఎఎం అధినేత కాలేజీ ఎం.శేషగిరి, డాక్టర్ నెల్లూరి రమేష్, కపిలవాయి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్వెల మాధురి ఆత్మహత్యాయత్నం!

● లక్ష్మీపురం టోల్‌గేట్ వద్ద కారు బోల్తా

● ఆస్పత్రికి తరలింపు

● చికిత్సకు సహకరించని మాధురి

పలాస,మహానాడు: టెక్కలికి చెందిన దివ్వెల మాధురి జాతీయ రహదారిపై ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ వ్యవహారంలో గత కొన్ని రోజులుగా ఆయన భార్య వాణి తీవ్ర ఆరోపణలు చేస్తున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం తనే కారు డ్రైవ్ చేసుకుంటూ పలాస మండలం లక్ష్మీపురం టోల్‌గేట్ సమీపంలో ఆగి ఉన్న కారును ఢీ కొట్టారు. దీంతో కారు బోల్తా పడింది. ఈ ఘటనలో ఆమెకు





గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల సాయంతో ఆమెను పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైకాపా ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీను వ్యవహారంలో ఆమె పేరు ఇటీవల చర్చనీయాంశమైంది.

అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాత తన భర్త మాధురితోనే ఉంటూ, కుటుంబాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని ఆయన భార్య, టెక్కలి జడ్పీటీసీ సభ్యురాలు దువ్వాడ వాణి ఆరోపిస్తున్నారు. కాగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాధురి మీడియాతో మాట్లాడుతూ.. మూడు రోజులుగా తనపై ట్రోల్ చేస్తున్న వార్తలకు తీవ్ర మనస్తాపానికి గురైనట్టు చెప్పారు. డిప్రెషన్‌లో ఉన్నానని, ఆత్మహత్య చేసుకునేందుకే ఇంటి నుంచి బయటకు వచ్చానని తెలిపారు.



## కాటూరులో యథేచ్ఛగా కోడిపందాలు,పేకాట!

● పోలీసుల కనుసన్నల్లోనే వ్యవహారమంతా...

కాటూరు, మహానాడు: కాటూరులోఅసాంఘిక కార్యకలాపాలు యథేచ్ఛగా సాగు తున్నాయి. పోలీసుల కనుసన్నల్లోనే రాత్రీపగలు తేడా లేకుండా కోడిపందాల నిర్వహిస్తున్నారు. పక్క నియోజకవర్గానికి బదిలీపై వెళ్లిన పోలీస్ అధికారి అండతోనే పందాలు జరుగుతున్నాయంటూ బహిరంగ చర్చించుకుంటున్నారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాలు జూదశాలలుగా మారుతున్నాయంటూ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ముదునూరులో జరుగుతున్న పేకాటలో పట్టుబడ్డ ఓ అధికార పార్టీ నాయకుడు వద్ద 70,000 లంచం తీసుకున్నట్టు విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. ఇంతకీ 70,000 లంచం తీసుకుని వది లేసిన పోలీస్ అధికారి (ఆవేశం స్టార్)ఎవరు? అని



అంటున్నారు. గత కొంతకాలంగా రూరల్ పోలీసుల అండతోనే గ్రామాలలో కోడి పందాలు జూదశాలలు జరుగుతున్నాయి అంటూ చర్చించుకుంటున్న ప్రజలు..గతంలో బోళ్లపాడు కేంద్రంగా సాగే కోడిపందాలు పేకాట శిబిరాలు ఇప్పుడు కాటూరు ముదునూరు గ్రామాల్లో జరుగుతున్నాయని అంటున్నారు. ప్రభుత్వం మారినా మారింది నిర్వహించే కేంద్రాలేనన్న విమర్శలు ఉన్నాయి. ప్రశాంతంగా ఉండవలసిన గ్రామాలు ఇలా జూద శిబిరాలగా మారడంపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీటివల్ల గ్రామంలోని యువకులు చెడు మార్గం పట్టే ప్రమాదం ఉందని ఉన్నతాధికారులు కల్పించుకుని గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న ఈ జూద క్రీడలను కోడిపందాలను అరికట్టాలని కోరుకుంటున్నారు.

## అంబేద్కర్‌ను అవమానించిన వ్యక్తి జగన్

● చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు

చిత్తూరు, మహానాడు: స్మృతి వనంలో ఏర్పాటుచేసిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం శిలాఫలకంలో అంబేద్కర్ పేరు కంటే తన నామాన్ని పెద్ద అక్షరాలతో రాయించుకుని ప్రపంచ మేధావి, రాజ్యాంగ నిర్మాతనే తీవ్రంగా అవమానించిన ఏకైక వ్యక్తి మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాద్ రావు దుమ్మెత్తిపోశారు. ఢిల్లీ పార్లమెంటు సమావేశాలకు హాజరైన ఎంపీ.. రాష్ట్రంలో వైసిపి అధినేత, మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి అనుసరిస్తున్న విధానాలను తప్పుపట్టారు. అదే సమయంలో జగన్ రెడ్డిని సమర్థిస్తున్న వైకాపా నాయకుల వ్యాఖ్యలను ఖండించారు.

గత వైసీపీ పాలనలో ఎస్సీ, ఎస్టీల హక్కులను కాలరాసి, దళితులకు తీవ్ర అన్యాయం చేసిన దళిత వ్యతిరేకి జగన్ రెడ్డి అన్నారు. భారత రాజ్యాంగాన్ని పక్కనపెట్టి, రాజారెడ్డి రాజ్యాంగాన్ని రాష్ట్రంలో అమలుపరిచిన ఫ్యూడలిస్ట్ జగన్ రెడ్డి అని విమర్శించారు. తన స్వార్థ రాజకీయాల కోసం రాజ్యాంగ స్ఫూర్తినే దెబ్బతీసిన ఘనుడు జగన్ అని అన్నారు. ఏపీలో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు రాజకీయ లబ్ధి కోసం చేసిందేనని అన్నారు.

కోనసీమ అంబేద్కర్ జిల్లా పేరుతో జగన్ కుట్రలు చేసి చిచ్చు పెట్టారని మండిపడ్డారు. అంబేద్కర్ విదేశీ విద్యా పేరును తొలగించి జగనన్న విదేశీ విద్య పేరు ఎందుకు పెట్టారని ప్రశ్నించారు. అంబేద్కర్ కంటే జగన్ గొప్పవాడా..? అని నిలదీశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో దళితులపై జరిగిన దాడుల్లో ఏపీ మొదటి స్థానంలో ఉందన్నారు. అంబే



ద్కర్ పేరు ఎత్తి, విగ్రహాన్ని తాకే అర్హత జగన్‌కి.. ఆయన్ను సమర్థిస్తున్న వైసీపీ నేతలకు ఉందా..? అని నిలదీసారు. అంబేద్కర్ విదేశీ విద్యతో పాటు 27 సంక్షేమ పథకాలను రద్దుచేసి, దళితుల సంక్షేమాన్ని అడ్డుకున్న దళిత ద్రోహి జగన్ రెడ్డి అన్నారు. ఏపీ సీఎం శ్రీ చంద్రబాబు నాయుడు ఉన్నత లక్ష్యంతో నాడు తీసుకొచ్చిన అంబేద్కర్ విదేశీ విద్య పథకం పేరును జగన్ విదేశీ విద్యానిధిగా ఎందుకు మార్చారని నిలదీశారు. ఇంత కంటే సిగ్గుమాలిన చర్య ఉంటుందా అన్నారు. సబ్ ప్లాన్ నిధులు 40 వేల కోట్లు దారి మళ్లించి, ఎస్సీ, ఎస్టీల సంక్షేమాన్ని దెబ్బతీసిన వ్యక్తి జగన్ అని చెప్పారు.

ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్న కూటమి ప్రభుత్వానికి వైకాపా నాయకులు సహకరించి రాష్ట్ర అభివృద్ధికి తోడ్పాటునందిస్తే ప్రజలు హర్షిస్తారు గాని.., ప్రజాస్వామ్య విలువల్ని కాలరాసి, ఏపీ ప్రగతిని అడ్డుకుంటే.. ప్రజలు క్షమించరని ఎంపీ హెచ్చరించారు.

## ఎన్నారైలు రాష్ట్ర అభివృద్ధిలో పాలుపంచుకోవాలి

● ఫాంగ్ టెక్ ల్యాబ్ ఐ. టి. ట్రైనింగ్ సెంటర్ ప్రారంభోత్సవంలో పెమ్మసాని పిలుపు

గుంటూరు, మహానాడు: అమెరికాలో స్థిరపడ్డ ప్రవాస భారతీయులు ఆంధ్రప్రదేశ్ కు వచ్చి రాష్ట్ర అభివృద్ధిలో పాలుపంచుకోవాలి. మరెందరికో స్ఫూర్తిగా నిలవాలి. ఐ.టీ., ఇతర సాంకేతిక రంగాల్లో స్థిరపడాలనుకునే విద్యార్థులకు మద్దతుగా ఉండాలని గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్



పెమ్మసాని చంద్రశేఖర్ కోరారు.

స్థానిక బృందావన్ గార్డెన్స్‌లో ఫాంగ్ టెక్ ల్యాబ్ ఐటీ ట్రైనింగ్ సెంటర్‌ను పెమ్మసాని చంద్రశేఖర్ ఆదివారం ప్రారంభించారు. ప్రారంభోత్సవం అనంతరం సంస్థ నిర్వాహకులు జాగర్లమూడి వెంకట్ ట్రైనింగ్ సెంటర్ వివరాలను




పెమ్మసానికి వివరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ అమెరికాకు వెళ్లాలనుకునే విద్యార్థిని, విద్యార్థులకు ఐ.టీ రంగంలో మరింత నైపుణ్యతతో కూడిన కోచింగ్‌ను అందించడంలో భాగంగా ఈ కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

సరైన గైడెన్స్ లేక అమెరికా వెళ్లిన విద్యార్థులు పార్ట్ టైం ఉద్యోగాలు చేస్తూ ఇబ్బందులు పడుతున్నారని, ఇలాంటి కంపెనీలలో ట్రైనింగ్ తీసుకుని వెళితే అమెరికాలో ఇబ్బందులు పడాల్సిన అవసరం రాదని తెలిపారు. ఒక ప్లానింగ్ ప్రకారం మూడు నెలలకు ఒకసారి 50 మందికి ప్యాకేజ్ గా శిక్షణ అందిస్తారని పెమ్మసాని అన్నారు. 50 మందితో ప్రారంభమైన ఈ ట్రైనింగ్ సెంటర్ 500 మందికి చేరాలని కోరుకుంటున్నానని తెలుపుతూ నిర్వాహకులు వెంకట్‌కు పెమ్మసాని అభినందనలు తెలిపారు.

## రాత్రి - పగలు మధ్య..

● నాసా షేర్ చేసిన 'టెర్మినేటర్' చిత్రాలివి

(శివ శంకర్ చలువాది)

సూర్యకాంతి ప్రసరిస్తూ.. చీకట్లు వెనక్కిపోతున్న దృశ్యం

రోజూ రెండు సార్లు జరిగే ప్రక్రియ

అంతరిక్షానికి, భూమికి మధ్య కాంతులతో అద్భుత చిత్రాలు

వెలుగు మొదలైతే పగలు.. వెలుగు వెళ్లిపోతే రాత్రి..

ఈ రెండింటికి మధ్య ఉండేది సంధ్యా సమయం. మనకు ఇదే స్పష్టంగా కనిపించదు. కానీ ఆకాశం నుంచి చూస్తే.. వెలుగు, చీకట్ల మధ్య ఒక విభజన రేఖ కనిపిస్తుంది. భూమి తిరుగుతున్న కొద్దీ అది నిరంతరం కదులుతూనే ఉంటుంది. ఇలా రాత్రిని, పగలును విభజించే రేఖను సాంకేతికంగా 'టెర్మినేటర్' అని పిలుస్తారు.

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి చిత్రించి.. భూమ్మీద దాదాపు అన్ని ప్రాంతాల్లో రోజూ రెండు సార్లు ఈ ప్రక్రియ జరుగుతుంది. టెర్మినేటర్ రేఖ వాటిపై నుంచి కదులుతూ వెళుతుంది. భూమికి 400 కిలోమీటర్ల ఎత్తున తిరుగుతున్న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి ఈ టెర్మినేటర్ రేఖను నాసా చిత్రించింది. తాజాగా తమ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్లో ఆ ఫొటోలను పోస్ట్ చేసింది.

అంతరిక్షానికి భూమికి మధ్య కాంతులతో..

ఈ చిత్రాల్లో.. అన్నింటికన్నా పైన నల్లని అంతరిక్షం..



దాని దిగువన నీలి రంగులో భూమి వాతావరణం.. దాని కింద భూమిపై పడి తెలుపు రంగులో ప్రతిఫలిస్తున్న కాంతి.. ఆ దిగువన బంగారు రంగులోని సంధ్యా సమయ కాంతి.. అన్నింటికన్నా కింద ఇంకా రాత్రి చీకటిలో ఉండి నలుపు రంగులో కనిపిస్తున్న భూమి కనిపిస్తున్నాయి.

## యువకుడిని బలి తీసుకున్న మొబైల్ గేమ్!

వినుకొండ మహానాడు: మొబైల్ గేమ్ యువకుడిని బలి తీసుకున్న సంఘటన బొల్లాపల్లి మండలంగంగుపల్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఓ యువకుడు డి ఇమ్మనుయేలు (21) శుక్రవారం రాత్రి పూట 10:39 గం॥ మొబైల్ తీసుకుని గేమ్ ఆడు కుంటూ బిల్డింగ్‌పైకి వెళ్ళాడు. గేమ్ అడుతునే పైనుంచి జారి కింద పడిపో యాడు. తలకు బలమైన గాయం వల్ల గుంటూరు జనరల్



ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు చికిత్స అందించారు. అయినా ఫలితం లేకపోయింది. ఆ యువకుడు ఈ లోకాన్ని వీడాడు.

## నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్‌పై రాళ్ళ దాడి!

- సీఆర్‌పీఎఫ్ అలర్ట్‌తో దుండగుల పరార్

నడికుడి, మహానాడు: నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్‌పై రాళ్ళ దాడి జరిగింది. పల్నాడు జిల్లా, దాచేపల్లి మండలం నడికూడి స్టేషన్ నుండి రైలు రాత్రి 1:30



బయలు దేరి బి క్యాబిన్ నుండి అండర్ బ్రిడ్జి సమీపానికి వెళున్న సమయంలో దొంగలు ఏసీ బోగీలపై రాళ్ళతో దాడి చేశారు. రైలులో మొత్తం 16 బోగీలు ఉన్నాయి. దాడిలో ఎనిమిది మంది దుండగులు పాల్గొన్నట్టు తెలుస్తోంది. దాడి ఘటనను పసిగట్టిన సీఆర్‌పీఎఫ్ పోలీసులు వెపన్లతో డోర్లు తీయడంతో దుండగులు పరారయ్యారు.

5

జనం గుండె చప్పుడు

మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || సోమవారం 12, ఆగస్టు 2024

# దేవాలయాల్లో ఎమ్మెల్యే జూలకంటి పూజలు

కారంపూడి, మహానాడు:

కారంపూడి మండలంలోని పలు దేవాలయాల్లో ఆదివారం మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా మండలంలోని పేట సన్నిగండ్ల శివారులోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో ప్రత్యేక హోమాలు చేశారు. ఒప్పిచర్ల గ్రామంలోని శ్రీ పోలేరమ్మ తల్లి కొలుపుల జాతర కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అమ్మవారికి పట్టు వస్త్రం సమర్పించి, పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలేరమ్మ అమ్మవారి ఆశీస్సులతో ఈ ప్రాంత ప్రజలు పాడి పంటలతో సుఖ సంతోషాలతో ఉండాలని అయన అన్నారు.

ఈ కార్యక్రమంలో పంగులూరి. అంజయ్య, పంగులూరి. పుల్లయ్య, చప్పిడి రాము, బొల్లినేని శీను, కటికల బాలకృష్ణ, తండా మస్తాన్ జానీ, గుండాల శ్రీనివాస్ కూరపాటి, ప్రసాద్,



చావా. వీరాంజనేయులు తదితర నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమం గురించి మాట్లాడే నైతిక అర్హత జగన్‌కి లేదు

- ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, మహానాడు:



అయిదేళ్లు అధికారం వెలగబెట్టి అన్నివిధాలుగా రైతుల ఉసురు తీసిన జగన్ రెడ్డి మొసలికన్నీళ్లు చూస్తుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందని చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఎద్దేవా చేశారు. కౌలు రైతుల ఆత్మహత్యల్లో దేశంలో రెండో స్థానం, రైతు ఆత్మహత్యల్లో మూడో స్థానంలో ఏపీని నిలిపిన ఘనుడికి అసలు రైతు సంక్షేమం గురించి మాట్లాడే నైతిక అర్హత ఎక్కడిదని ప్రశ్నించారు. వైకాపా అయిదేళ్ల పాలనలో రైతు లకు అప్పులు, ఆత్మహత్యలు, కన్నీళ్లే మిగిలినా కనీసం ఏ ఒక్కర్ని పరామర్శించిన పాపాన పోని వ్యక్తి జగన్ అని దుయ్యబట్టారు. పంటల బీమా చెల్లించలేదు, రైతులపై చంద్రబాబు ప్రభుత్వం నిర్లక్ష్యం అంటూ జగన్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్‌గా ఆదివారం మీడియాతో మాట్లాడిన ప్రత్తిపాటి.. నిప్పులు చెరిగారు. అయిదేళ్ల ఏలుబడిలో కనీసం అయిదుసార్లు కూడా రైతుల్ని కలవని వ్యక్తి, తుపాను బాధితులను చూడ్డానికి కూడా రెడ్‌కార్పెట్ లపై వెళ్లిన వ్యక్తి ఇప్పుడు ఏదేదో మాట్లాడడం చూస్తుంటే వింతగా ఉందన్నారు. జగన్ పాలనలో సగటున ఏడాదికి 1100మంది రైతులు బలవన్మరణాలకు పాల్పడ్డారనే విషయాన్ని మరిచి పోయారా నిలదీశారు. తెగుళ్లతో నష్టపోయిన మిరప రైతులకు పరిహారం ఇవ్వకుండా తుపానులతో నష్టపోయిన ధాన్యం రైతులను కనీసం ఆదుకోకుండా ఇప్పుడు వచ్చి ఉత్తుత్తి ప్రేమలు ఒలకబోయడం ఎందుకని ప్రశ్నించారు. జగన్ అయిదేళ్ల పాలనలో మొత్తం రూ.10వేల కోట్ల వరకు రైతులకు బకాయిలు పెట్టి వారిని నిండా ముంచారని ఆవేదన వ్యక్తం చేశారు.

# ఆ చెట్టు ఉంటే సినిమా హిట్టే!

- 145 సంవత్సరాల మహా వృక్షం కనుమరుగు

(టివి గోవింద రావు)

సినిమాలో మనకు తరచుగా కనిపించే కుమారదేవం సినిమా చెట్టు ఇకనుంచి ఒక చరిత్ర..ఈ తెల్లవారుజామున గోదావరి వరదతో చెట్టు కూలిపోయింది. కొవ్వూరు మండలం తాళ్ళపూడి దగ్గర్లోని కుమారదేవం గ్రామంలో ఈ నిద్ర గన్నేరుచెట్టును గోదారితల్లి ఒడ్డున మహానుభావుడు సింగలూరి తాతబ్బాయి నాటారు.

ఎన్నో వరదల్నీ తుఫాన్లనీ,తట్టుకుంటా తరతరాల్ని చూసు కుంటా పెరిగి మహా వృక్షమైన దీన్ని పేరు కూడా మర్చిపోయి సినిమా చెట్టు అని పిలుస్తారిక్కడి జనాలు. అలా అనడానికి కారణం దీనికింద పాడిపంటలు, దేవత, వంశవృక్షం, బొబ్బిలి రాజా, హిమ్మత్ వాలా, సీతారామయ్యగారి మనవరాలు ఇలా లెక్కెట్టు కుంటా పోతే మొత్తం నూటెనిమిది సినిమాల షూటింగ్ జరిగింది.

కెమెరా తీసుకొచ్చి దీని కింద పెడితే ఫ్రేము దానంతటదే వచ్చేస్తుంది. అంత మహత్యం ఈ చెట్టుది. ఇంకో విషయం ఈ చెట్టు కింద ఒక్క షాట్ తీస్తే చాలు సిన్మా సూపర్ హిట్టు అన్న సెంటిమెంటు కూడా వుంది . దర్శకుడు వంశీ అయితే ఈ చెట్టు లేకుండా సినిమా తీయరు. రాఘవేంద్రరావు , దాసరి , జంధ్యాల , ఇవివి ...ఇలా గొప్ప డైరెక్టర్లందరూ ఈ చెట్టు చుట్టూ తిరిగినవారే.

145 ఏళ్లనాటి సినిమా చెట్టు
ఈ చెట్టు వద్ద 108 సినిమాల చిత్రీకరణ
వంశీ దర్శకత్వంలో 18 చిత్రాల షూటింగ్

1974లో వచ్చిన పాడిపంటలు చిత్రంలో ఇరుసులేని బండి ఈశ్వరుని బండి.. పాటనుండి మొదలైన ఈ చెట్టు




ప్రస్థానం...సీతారామయ్యగారి మనవరాలులో సమయానికి... గోదావరిలో ఉప్పొంగేలే గోదావరి లాంటి పాటలు ...ఇలా ఒకటేమిటి.. చెప్పుకుంటూపోతే వందలాది పాటలు... జనాల గుండెల్లో ఇప్పటికీ పదిలంగా ఉన్నాయి..

ఎన్నో వరదల్నీ తుఫాన్లనీ,తట్టుకుంటా తరతరాల్ని చూసుకుంటా పెరిగి మహా వృక్షమైన సినిమా చెట్టు ఇక లేదు అనే వార్త నిజంగా బాధాకరం.

# మూడు రోజుల పాటు ఆర్జిత సేవలు రద్దు

తిరుమల,మహానాడు:

ఈ నెల 15వ తేదీ నుంచి 17వ తేదీ వరకు పవిత్రోత్సవాలు పలు సేవలను రద్దు చేస్తున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు తెలిపింది. ఆగస్టు 14వ తేదీన అంకురార్పణ కారణంగా సహస్రదీపాలంకార సేవ, 15వ తేదీన తిరుప్పావడ, 15వ తేదీ నుంచి 17వ తేదీ వరకు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలు రద్దు చేస్తున్నట్లు టీటీడీ తెలిపింది.



మూడు రోజుల పాటు ఆలయంలోని సంపంగి ప్రాకారంలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు స్నపన తిరుమంజనం సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన ఆభరణాలతో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామి వారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిస్తారని టీటీడీ అధికారులుచెప్పారు.

శ్రీవారి ఆలయంలో ఏడాది మొత్తం జరిగే అర్చనలు, ఉత్సవాల్లో యాత్రికుల వల్లగానీ, సిబ్బంది వల్ల గాని తెలియక కొన్ని దోషాలు జరుగుతుంటాయి. వాటి వల్ల ఆలయ పవి త్రతకు ఎలాంటి లోపం రానీయకుండా ఆగమశాస్త్రం ప్రకారం పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

# సీఎం మర్యాద పూర్వకంగా కలిసిన తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్

హైదరాబాదు, మహానాడు:

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని ఆదివారం తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ హైదరాబాదులో ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించారు.

అనంతరం తిరుమల తిరుపతి దేవస్థానంలో వసతి, దర్శనానికి సంబంధించి తెలంగాణ రాష్ట్ర శాసన సభ్యుల ఉత్తర్వులకు అర్హత కల్పించాలని మెమోరండం ఇచ్చారు.





# నగరంలో ఓ జీవితం..

(శ్రీపాద శ్రీనివాస్)

కాంక్రీట్ జంగిల్ లాంటి నగరాల్లో అందరి జీవితాలు యాంత్రికమే..!

నీకు నేనున్నానని, నీకు తోడై నిలుస్తాను అని భరోసా ఇచ్చేవారి జాడలు ఎండమావులే ఇక్కడ.

బ్రతుకు పోరాటంలో ఎందరిలోనో మానసిక సంఘర్షణలు.. మరెన్నో ఆవేదనలు, ఆ వెనుకనే తమని తామే ఊరడింపు చేసుకునే ఘటనలు నిత్యకృత్యాలే ఇక్కడ వారికి.

అందుకే..” మూడు కాలాలలో ను... ముల్లోకాలలోను శ్రమైక శ్రమైక జీవనానికి సమానమైనది లేదురా..” అనే శ్రీ శ్రీ గీతంలోని ధోరణికి అద్దం పడుతూంటాయి నగరాల్లోని చాలమంది జీవితాలు.అటువంటి ఒకరి యాంత్రిక జీవితానికి అక్షర రూపాన్ని ఇచ్చే ప్రయత్నమే “నగరంలో ఓ జీవితం”.. అనే ఈ కథానిక..!

•••

సకల జనానికి రాత్రి అంతా జోలపాడి అలసినట్టుగా చంద్రుడు నిష్క్రమిస్తూంటే... ఎవరి విధులను వారికి గుర్తు చేస్తునట్లుగా సూర్యుడు తన దినచర్య ప్రారంభిస్తున్నాడు.

ఆ రోజు శనివారం... అబిడ్స్ ప్రాంతం.

చుట్టూ పరికించి చూస్తే ఎత్తైన భవనాలు.. వాటిని తాకుతున్నయా అన్నట్లుగా ఆకాశంలోని మేఘాల పరుగులు... ఆ మేఘాల వేగంతో పోటీ పడుతున్నట్టు గా భూమి మీధ జనం బ్రతుకు తెరువు కోసం పరుగులు.

వాహనాల రణగొణ ధ్వనుల అలికిడికి అప్పుడే మెలుకువ వచ్చింది మోహన్ కి. బద్ధకంగా ఆవలిస్తూనే గత జ్ఞాపకాల ఒడిలోకి జారుకున్నాడు.

•••

పట్నంలోని బడికి వెళ్ళే బస్సుకోసం తాము ఉండే పల్లెలోని పచ్చని పైర్లు మీదగా పొలాల వెంబడి పరుగులు....

ఆసమయంలో చల్లని చిరు గాలికి పచ్చని పైర్ల సవ్వడిలు..

ఆ పైర్ల నడుమే అమ్మ పొదుగు కోసం లేగదూడల అరుపులు..

....అంతేనా...”ఓరేయ్ మోహన్.. ఈ క్యారేజి తీసుకుని లంచ్ టైమ్ లో తినరా.. అంటూ ఆ పచ్చని పైర్ల వెంబడి పరిగెడుతూ అమ్మ పిలుస్తున్న పిలుపులు.... ఒక్కసారి తన చెవిని తాకినట్లుగా అనూభూతి కలిగింది మోహన్ కి.

అల్లారం గట్టిగా మ్రోగడంతో జ్ఞాపకాల ఒడిలో నుండి వర్తమానంలోకి వచ్చేసాడు...!

•••

శనివారం కావడంతో.. త్వరగానే ఆఫీసులో పని ముగించుకుని తన మావయ్య ఇంటికి చేరుకున్నాడు మోహన్.

“ఏరా మోహన్ బాగున్నావా..” అని తన మావయ్య అంటున్నమాటలు గుమ్మంలోకి అడుగు పెట్టిన మోహన్‌కి వినపడ్డాయి.

ఆ పిలుపులోని అప్యాయతకి మోహన్ మనస్సు ఒక్క సారిగా పులకించిపోయింది. ఆ పులకరింతతో తాను రోజంతా పడుతున్న కష్టం ఒక్కమారు ఎవరో చేతితో తీసిపారేసినట్టు అనిపించింది మోహన్‌కి.

“అవును మావయ్య..బాగానే ఉన్నాను.. మీరందరూ ఎలా ఉన్నారు? రేపు ఆదివారం కదా మీ అందరితో సరదాగా గడపొచ్చు అని వచ్చాను. నాకు మాత్రం ఎవరున్నారు చెప్పు. మీరు తప్ప అని మోహన్ తన మాటను పూర్తి చేస్తుండగానే.

“వారం తర్వాత మాకు పిల్లలతో ప్రశాంతంగా గడిపేరోజు ఆదివారం.. ఆరోజు కూడా ఎవరో ఒకరు వచ్చి ఇంటిమీద పడితే ఎలా..పైగా ఆడపిల్లలు ఉన్న ఇల్లు ఇది. అంటూ కిచెన్ లో నుండి అత్తయ్య అంటున్న మాటలు నెత్తిమీద పిడుగు పడినంతగా బాధించాయి మోహన్‌కి.

మరుక్షణమే బిక్కమొహంతో... చాలా కాలం అయిందని ” మిమ్మల్ని ఓ మారు చూసి పోదామని వచ్చాను అంటూ పలకడం మినహా మోహన్ కి మరో గత్యంతరం లేకపోయింది.

“తటపాయిస్తూనే.. “కనీసం వారానికి ఒక్కసారైనా మీరు ఎలా ఉన్నారో ఫోన్ చేస్తూ ఉంటాను మావయ్య అంటూ నిలబడి ఉండిపోయాడు మోహన్.

“ఎందుకురా ఫోన్లు చేస్తూ సమయాన్ని, డబ్బును వృధా చేసుకోవడం. ఏదైనా పని ఉంటే నేనే చేస్తానులే” అంటూ మోహన్ వైపు చూడకుండానే దినపత్రిక పేజీలను విసురుగా తిరగేస్తు అన్నాడు మావయ్య.

తనపట్ల మావయ్య వైఖరి, అత్తయ్య పుల్ల విరుపు మాటలు మనస్సుకు తూటాలుగా తాకడంతో అక్కడ ఒక్క క్షణం ఉండబుద్ధి కాలేదు మోహన్‌కి.

•••

ఆలోచనల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతూనే చీకటి వేళకి మెస్ కి చేరాడు మోహన్.

“ జీవితం మరీ యాంత్రికం అయిపోయింది. అవసరాల ప్రాతిపదికనే గౌరవ మర్యాదలు..ఆదరణలు దక్కుతున్నాయి.

చివరికి చావు విషయాలకు సంబంధించిన పలకరింపుల విషయంలో కూడా ఆర్థిక స్తోమత అంశాలే ప్రాధాన్యత వహిస్తున్నాయి.

నిజంగా నగర జీవితాలు చాలమటుకు నరక ప్రాయం అని మనస్సులో అనుకుంటూ పరజ్ఞానంలో మునిగిపోయాడు మోహన్.

“ఎవరికి ఎవరు ఈ లోకంలో ఎవరికి ఎరుక...ఏ దారి ఎటుపోతుందో ఎవరిని అడగక....” అంటూ మెస్ లోని స్పీకర్ లో వస్తున్న పాట విన్న మోహన్ కి కళ్ళు చెమర్చాయి.

•••

“నీలోని కష్టపడే గుణం భవిష్యత్తులో నిన్నుఎంతో ఎత్తుకు తీసుకుని వెలుతుందిరా మోహన్” అంటూ చిన్నతనంలో తనతోటి స్నేహితులు అన్నమాటలు రూమ్ లో సేదతీరుతున్న మోహన్ కి గుర్తుకొచ్చాయి.

“ఎంతో ఎత్తుకు ఎదడగడం మాట దేవుడెరుగు..జీవితం మాత్రం కష్టాలు పాలవుతోంది..

మనుషుల్లో ప్రేమానురాగాలు, ఆప్యాయతలు, మానవీయ విలువలు అంతకంతకూ అంట కాగుతున్నాయి ఈ కాంక్రీట్ జంగిల్ లోని చాలామందిలో...

అన్నింటా స్వార్థమే... “– తాము బాగుంటే చాలు, మిగతా సమాజం ఏమై పోయిన పరవాలేదు అనుకునేవారిదే పైచెయ్యి అవుతోంది ఈ రోజుల్లో... అంటూ బాధతప్త హృదయంతో ఒక్కమారు ఆకాశం కేసి చూసాడు మోహన్..

సరిగ్గా ఆ సమయంలోనే మేఘాలు ఎరుపెక్కి ఉన్నాయి. మనస్సులోని బాధతో బరువెక్కిన తన గుండెల్లాగే ఆ మేఘాలు ఉన్నట్లుగా తోచింది మోహన్ కి.

ఇంతలో చినుకులు కూడా ప్రారంభమయ్యాయి..తన మనసులోని భారాన్ని చినుకుల రూపంలో మేఘాలు జార విడుస్తున్నట్టుగా అనిపించింది మోహన్‌కి.

కొన్ని జ్ఞాపకాలు మకరందపు మాధుర్యాన్ని కురిపిస్తాయి. ఆ మాటునే తెనెటీగల కాటు బాధను కూడ మనస్సుకు కలిగిస్తాయి. అటువంటి జ్ఞాపకాలు గత సంఘటనలను సజీవంగా మనలో నిలుపుతాయి.

అటువంటి జ్ఞాపకాలు పొరలు పొరలుగా మోహన్ మనస్సులోకి చొచ్చుకొచ్చాయి ఆక్షణంలో...

•••

అట్లతద్దినాడు ఉదయాన్నే స్నేహితులతో చద్దిమూట ఆటలు... ఆ ఆటల్లో భాగంగా స్థానికుల పెరట్లలోని చెట్ల కాయలను కోసేయ్యడం... మరొకరి ఇంటికి గొళ్లాలను పెట్టడం.. ఒకరి ఇంటి నెమ్స్ బోర్డులను మరొకరి ఇంటికి తగిలించేయడం. ఈ క్రమంలో దొరికి పోయిన వాళ్ళకి పెద్దలచే అరదండలు వంటి తన చిన్ననాటి సంఘటనలు మోహన్ కళ్ళముందు కదలాడాయి...

అంతేనా... “అందరికి ఒకే బంతి బదులు తలోకరికి ఒక్కొక్క బంతిని ఇస్తే ఎవరి ఆటను వారే ఆడుకుంటారు కదా..” అని ఫుట్‌బాల్‌ను ఆడిస్తున్న డ్రిల్ మాస్టారుతో పరిహాసం.. వెనువెంటనే మాస్టారి చేత చివాట్లు తినడం.

అదేవిధంగా.. జనవరి ఫస్ట్ నాడే పుట్టినరోజు జరుపుకునే ఆడ పిల్లలను ఉద్దేశించి... “నూతన సంవత్సర తార... ఉదయించెను ఈపూట...ప్రకాశించును ఇకపై ప్రతి ఏటా” అని క్లాస్ రూంలోని బ్లాక్ బోర్డ్ పై కొంటెగా వ్రాయడం.

దరిమిలా క్లాస్‌లోని మగపిల్లలు అందర్నీ మాస్టర్లు ఎండలో నిలబెట్టడంవంటి నేటికీ నవ్వు తెప్పించే నాటి సంఘటనలు కళ్ల ముందు తచ్చాడాయి మోహన్‌కి ...

“మీరు మాకు కన్నబిడ్డల కంటే ఎక్కువే.మీకు జన్మ ఇచ్చింది తల్లి తండ్రలు అయితే...మంచి నడతతో సమాజంలో ఉన్నత స్థితికి మీరందరూ చేరుకోవాలనే తపన మీ పట్ల మా అందరికీ వుంటుంది. కొన్ని సందర్భాల్లో మిమ్మల్ని దండించాం, కాని అవి అన్ని మీపై ఉన్న మమకారంతో చేసినవే... మీ అభ్యున్నతిని ఆశించి చేసినవే. విద్యా సంవత్సరం ముగిసినప్పుడు కన్నబిడ్డల్ని వీడుతున్నామనే బాధ మాకు ప్రతి ఏడాది రివాజై పోయింది.

మేము కూడ మీ వయస్సులో మీలాగే అల్లరి చేసిన వాళ్లమే, గురువుల చేత దండింపబడ్డ వాళ్ళమే. నాటి అల్లర్లు, దండనలు. మమ్మల్ని మేము తీర్చి దిద్దుకునేందుకు సోపానాలు అయ్యాయి” అని నాడు ఉపాధ్యాయిలు అంటున్న సందర్భం తన కండ్ల ముందు కదలాడాయి మోహన్‌కి.

ఈనాటికి అనిపిస్తూ ఉంటుంది. ఏ నలుగురైనా గుమి కూడినచోట నాటి స్నేహితులు, ఉపాధ్యాయులు ఎవరైనా తారస పడతారేమోనని.

..అయినా ఈ జీవిత ప్రయాణంలో ఎవరి గమ్యం వాళ్లది...

.....ప్రయాణంలో ఉన్నంత వరకే ఒకరికొకరం... అటు తరువాత ఎవరికి వారే యమునాతీరే కదా..... అని మనసులో అనుకున్నాడు మోహన్.

ఈ విధంగా నాటి జ్ఞాపకాల ఊరడింపుతో కొంత బరువును తన గుండెలపై నుండి దించుకున్నట్లు అనిపించింది మోహన్‌కి.

క్రమక్రమంగా తీపి జ్ఞాపకాల జోలపాటతో నెమ్మదిగా నిద్రలోకి జారుకున్నాడు మోహన్.

•••

రోజులాగే తెల్లవారింది. పక్షులు తమ కిలకిల రావాలతో బయలు దేరాయి.వాటి జీవన యాత్ర కోసం!

“కాలం, పరిస్థితులు మోసం చేస్తున్నాయని నిందించుకుంటూ కూర్చోవడంకాదు.

కాలంతో మమేకమై నడవడమే ఉత్తమం. అప్పుడే పరిస్థితులు అవగతం అవుతాయి.చక్కని జీవన పరిస్థితులకు మార్గాలు ఏర్పడతాయి.” అనే స్ఫూర్తి పక్షులను తదేకంగా చూస్తున్న మోహన్ కు కలిగింది.

....వాటిలాగే మోహన్ కూడా ఆశల జీవితంలోకి పరుగులు తీస్తున్నాడు యాంత్రికంగా.

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || సోమవారం 12, ఆగస్టు 2024

# కొత్త జంటలకు కొత్త రేషన్ కార్డుల జారీ

- జగన్ బొమ్మ తొలగించి మళ్లీ కొత్త రేషన్ కార్డులు పంపిణీ
- కూటమి సర్కార్ చర్యలు

అమరావతి,మహానాడు:

ఐదేళ్లుగా వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఇవ్వకుండా వదిలేసిన రేషన్ కార్డుల జారీకి కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. వైఎస్సార్సీపీ అధికారంలోకి వచ్చే నాటికి రాష్ట్రంలో కోటీ 47 లక్షల 33 వేల 44 రేషన్ కార్డులు ఉన్నాయి. 2024 ఆగస్టుకి వాటి సంఖ్య కోటీ 48 లక్షల 43 వేల 671కి చేరింది. అంటే గత ఐదేళ్లలో పెరిగిన కార్డులు లక్షా 10 వేలు మాత్రమే.

పెళ్లైన వారికి కొత్తగా కార్డులు ఇవ్వాలంటే అప్పటికే వారి కుటుంబానికి ఉన్న రేషన్ కార్డుల నుంచి పేర్లు తొలగించాల్సి ఉంటుంది. దీనికి ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. ఫలితంగా




కొత్తగా పెళ్లైన వారికి కార్డులు అందలేదు. ఈ సమస్యను పరిష్కరించేందుకు వివాహ నమోదు పత్రం ఆధారంగా కొత్త జంటకు రేషన్ కార్డు జారీ చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది.

# పాత నగరాన్ని పట్టించుకోని ప్రభుత్వాలు

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శ

హైదరాబాద్, మహానాడు:

నాంపల్లి అసెంబ్లీ, గుడిమల్కాపూర్ డివిజన్‌లో ఎంపీ నిధులతో నిర్మించిన కమ్యూనిటీ హాల్ ను ఆదివారం కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. దేశంలోనే హైదరాబాద్ అత్యంత ప్రాముఖ్యత ఉన్న నగరం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరం. హైదరాబాద్ నగరంలో మౌలిక వసతుల కల్పనకు అందరం కలిసికట్టుగా కృషిచేయాలి. నగరం నుంచే అధిక ఆదాయం వస్తున్న కేటాయింపుల్లో పూర్తిస్థాయిలో న్యాయం జరగడం లేదు. హైటెక్ సిటీ ప్రాంత అభివృద్ధిపై చూపిస్తున్న శ్రద్ధ పాత నగరం పై దృష్టి సారించడం లేదు.

ఈ ప్రభుత్వాలు గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం పాతనగరం అభివృద్ధిని పట్టించుకోవడం లేదు. నగర అభివృద్ధికి సమగ్రమైన ప్రణాళిక మాస్టర్ ప్లాన్ ను రూపొందించి అన్ని ప్రాంతాల్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. ముఖ్యమంత్రి



ప్రత్యేక చొరవ చూపి హైదరాబాద్ నగర అభివృద్ధికి నిధుల కేటాయింపులు పెంచాల్సిన అవసరం ఉంది. బస్తీల్లో రోడ్ల నిర్మాణం, పార్కుల అభివృద్ధి, మంచినీరు, డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరణ, వంటి అనేక మౌలిక వసతులను కల్పించాలి.

# ఐదేళ్ల పాపాలపై కూటమి ప్రభుత్వం అలసత్వం!

- వంశీ, కొడాలి నాని, రోజా వంటి నేతలు ఏమైపోయారో?
- సునీల్‌పై కేసు ఎప్పుడు?
- జవహర్‌రెడ్డిని వదిలేసినట్లేనా?
- సజ్జల భార్గవ్‌రెడ్డి, వర్రా రవీందర్‌రెడ్డి వికృత పోస్టింగులు మర్చిపోయారా?
- కేంద్ర నిధుల వరద సరే.. క్యాడర్ మనోగతం సంగతేమిటి?



(ఐకియా)

భారీ అంచనాల మధ్య ఏర్పడిన కూటమి ప్రభుత్వం అంచనాలను ఏమేరకు నిలబెట్టుకుంది అన్న విషయానికి వస్తే .. ఐదేళ్లలో జగన్ సర్కార్ చెప్పలేని రాష్ట్ర రాజధాని ఏది అన్న ఒక ప్రశ్నకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 5 నిముషాలలోనే ఎటువంటి ప్రకటన విడుదల చెయ్యకుండానే రాష్ట్ర ప్రజలందరికీ సమాధానం చెప్పగలిగింది.

అలాగే గత ఐదేళ్లు పెట్టుబడులు అన్న పేరుకూడా వినపడని ప్రజలకు 50 వేల కోట్ల పెట్టుబడితో బీపీసీల్ ఏపీలో పరిశ్రమను స్థాపించడానికి ముందుకొచ్చింది. గత ఐదేళ్లలో కేంద్ర బడ్జెట్లో వినపడని ఏపీ పేరు కూటమి ప్రభుత్వం ఏర్పడిన 5 వారాల్లోనే రాజధాని, పోలవరం, ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్ ల నిర్మాణానికి దాదాపు 50 వేల కోట్ల నిధులను రూపంలో రాబట్టుకోగలిగింది.

ఇలా ప్రజల అంచనాలను నిలబెట్టుకున్న కూటమి.. ప్రభుత్వం పార్టీ కార్యకర్తల, నేతల అంచనాలను నిలబెట్టుకోవడంలో మాత్రం బొక్కబోర్లా పడిందనే చెప్పాలి. గత వైసీపీ ప్రభుత్వంలో హద్దు దాటి ప్రవర్తించిన ప్రతి అధికారి మీద, నోరు జారీ ప్రవర్తించిన ప్రతి వైసీపీ నాయకుడి మీద చర్యలు తప్పవని ఊదరగొట్టిన బాబు, పవన్ లు అధికారం అందగానే ఒక్కసారిగా సైలెంట్ అయిపోయారు.

దేనికంటే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక శాఖల మీద సమీక్షలు అంటూ కొంతమంది అధికారులు, నాయకుల మీద విచారణకు ఆదేశాలు జారీ చేసినప్పటికీ వారిపైనా ఎటువంటి చర్యలు తీసుకోలేకపోయింది.

ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ ఎండి వాసుదేవ రెడ్డి, సీబీసీఐడీ డీజి సునీల్ కుమార్, పొన్నవోలు సుధాకర్, మాజీ డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి వంటి అధికారులు వల్లభనేని వంశీ, కొడాలి నాని, రోజా వంటి నేతలు ఏమైపోయారో ఎటువెళ్లిపోయారో తెలియని పరిస్థితి.

వైసీపీ ప్రభుత్వంలో ఒక మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబును కూడా ఎటువంటి ఆధారాలు, సాక్ష్యాలు లేకుండా 59 రోజుల పాటు జైల్లో నిర్బంధించగలిగారు. కానీ కూటమి ప్రభుత్వం చేతిలో సాక్ష్యాలు, ఆధారాలు, వీడియో ఫోటేజ్ లు ఉంచుకుని కూడా వారిని అరెస్టు చేయలేకపోతోంది.

వైసీపీ సామాన్య కార్యకర్త నుంచి అధినేత వరకు గత ఐదేళు అధికారమనే అహంకారం చూపిస్తూ ప్రతిపక్ష పార్టీ కార్యకర్తలనే కాదు పార్టీ నేతలను సైతం ఉక్కుపాదంతో తొక్కారు.

సోషల్ మీడియాలో వికృత పోస్టులు పెట్టి పార్టీలోని మహిళల నేతలను, కుటుంబంలోని మహిళలని సైతం అవమానించిన




వర్రా రవీంద్ర రెడ్డి, సజ్జల భార్గవ్ రెడ్డి వంటి వారి పై ఇప్పటికి చర్యలు తీసుకోలేకపోయింది.

అలాగే వల్లభనేని వంశీ, కొడాలి నాని, రోజా వీళ్లంతా రాష్ట్రం దాటిపోయారు అన్న వార్తలు ప్రచారంలో ఉండడంతో అసలు వీరు పారిపోతున్నారు లేక కూటమి ప్రభుత్వం పట్టుకోలేక పోతుందా అన్న అనుమానాలు కూడా తలెత్తుతున్నాయి.

కూటమి ప్రభుత్వం భౌతికంగా విజయం సాధించినప్పటికీ నైతికంగా వైసీపీనే రాజ్యమేలుతుందా? అన్నట్లుగా కూటమి పార్టీల కార్యకర్తలు ఆవేదన చెందుతున్నారు.

వర్రా రవీంద్రా రెడ్డి అరెస్టు అంటూ వార్తలు రావడం, ఆ వెంటనే అవి అవాస్తవాలంటూ తేలిపోవడం, వల్లభనేని వంశీని అదుపులోకి తీసుకున్నారు అని టీడీపీ పార్టీ శ్రేణులు సంబరపడేలోపే కాదు కాదు వంశీ అనుచరుడు అంటూ వాస్తవాలు బయటకు రావడం,

వైసీపీ ప్రతినిధి నాగార్జున యాదవ్ అరెస్టు అన్నారు ఆ తరువాత రోజు జగన్‌తో కలిసి ఢిల్లీ జంతర్ మంతర్ లో నిరసన కార్యక్రంలో పాల్గొన్నారు.అలాగే చంద్రగిరి నియోజకవర్గంలో టీడీపీ ఎమ్మెల్యే పులివర్తి నానిపై దాడి ఘటనలో ప్రధాన నిందితుడు వైసీపీ నేత చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని అరెస్టు చేసి 41నోటీసిలిచ్చి తిరిగి ఇంటికి సాగనంపారు.

బాబు అరెస్టయితే స్వీట్లు పంచుకుంటూ, టపాసులు పేల్చిన రోజా మెల్లగా రాష్ట్ర సరిహద్దులు దాటేసారు.అయినా కూటమి ప్రభుత్వానికి చీమకుట్టినట్టు లేదు. పుంగనూరు లో పసుపు చొక్కా వేసుకున్నాడని, టీడీపీ జెండా పట్టుకున్నాడని దారుణంగా అవమానించిన వైసీపీ నేత పెద్దిరెడ్డి అణుకాహారులు మీద ఇప్పటికి చర్యలు తీసుకోలేదు.

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ను తిట్టడానికే మంత్రి పదవి అన్నట్టుగా దూషించిన పేర్ని నాని, అంబటి రాంబాబు నోటికి ఇప్పటికి తాళం వేయలేకపోతోంది.

జగన్ అనుకున్నట్టుగానే వైసీపీ తిరిగి అధికారంలోకి వచ్చి ఉంటే టీడీపీ, జనసేన కార్యకర్తల మాట అటుంచితే పార్టీ అధినేతలైన బాబు, పవన్ లను జగన్ ఉపేక్షించే వారేనా? పెట్టిన పాత కేసులన్నీ తిరగేసి మరికొన్ని కొత్త కేసులు జోడించి పార్టీని, పార్టీ నాయకులను భూస్థాపితం చేసి ఉండేవారేగా? కానీ కూటమి ప్రభుత్వం తన అలసత్వంతో మరోసారి వైసీపీ కి అవకాశం ఇస్తుందా? అనేది ఒక్కసారి పునరాలోచించుకోవాలి.

# తాయత్తు మహిమ

(మహి చైతు)

తాయత్తుని మనం చాలా అవహేళన చేస్తున్నాము, వెక్కిరిస్తున్నాం. గతంలో పుట్టిన ప్రతి బిడ్డ ఊడిన బొడ్డు (Umbilical cord)ను ఈ తాయత్తులలో పెట్టి మొలతాడుకు కట్టేవారు., దానికే మరొక పేరు "బొడ్డు తాయత్తు" మందులు లేని, వైద్యానికి అందని ఎన్నో రోగాలు ఈ బొడ్డుని అరగతీసి నాకిస్తే తగ్గేవి. ఎవరి బొడ్డు వారికే పనికొచ్చేది కనుక దాన్ని వారికి అందుబాటులో ఉంచటంకోసం చాలా తేలికైన ఖర్చులేని పని.

ఒక తాయత్తు చేసి దానిలో పెట్టి ఎవరి బొడ్డుని వారి మొలకే కట్టేవారు. స్తోమత ఉన్నవారు, వెండితాయత్తులు చేయించుకునేవారు, లేనివారు ఏ రాగివో వాడుకునేవారు. ఏ మందుకు తగ్గని వ్యాధి ఎలా తగ్గిందంటే "తాయత్తు మహిమ" అనేవారు. ఈ "తాయత్తుమహిమ" అనే పదానికి అసలైన అర్థమిదే.

ఆధునిక సైన్సుకూడా దీనినే నిరూపించి, ఈ స్టెం సెల్స్ క్యాన్సర్, జుట్టు ఊడిపోవటం, కిడ్నీ, రక్త సంబంధ వ్యాధులు, ఎముకల సమస్యలకి ఇలా ఎన్నో అంతుబట్టని, ఒక పట్టాన తగ్గని రోగాలకు కూడా పని చేస్తుందని ప్రచారం చేసుకుంటూ వాటిని భద్రపరచటానికి బ్యాంకులు తెరిచి కోట్ల వ్యాపారం



చేస్తున్నారు.

ఇవాళ ఒక బొడ్డుని భద్రపరచటానికి ఒక బ్యాంకు లాకర్ అద్దె సుమారు 20,000 రూపాయలుంది. ఆ అవసరం లేకుండా తాయత్తులో పెట్టుకుని మొలకు చుట్టుకుంటే అనాగరికమయింది. అవహేళన చేయబడుతుంది. వెక్కిరించబడుతుంది. అవునులే, బట్ట కట్టుకోవటమే అనాగరిక మనప్పుడు.. మొలతాడు, దానికొక తాయత్తు మరింత అనాగరికమే అవుతుంది. అంత ఉపయోగమున్న బొడ్డుని, ఒకరిదొకరికి మారటానికి ఆస్కారం లేకుండా తాయత్తులో పెట్టి, ఖర్చు లేకుండా మొలకు కట్టుకోవటం "అజ్ఞానం".. ఒకరిది మరొకరికి మారే అవకాశమున్న లాకర్లో వేలు ఖర్చుపెట్టి దాచి పెట్టటం "విజ్ఞానం".

# రాంనగర్ చౌరస్తాలో తిరంగా ర్యాలీ

- ప్రారంభించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్, మహానాడు:

రాంనగర్ చౌరస్తాలో తిరంగా ర్యాలీ ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. స్వాతంత్ర దినోత్సవ పండుగ ప్రారంభమైంది. మూడేళ్ళుగా కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో స్వాతంత్ర దినోత్సవ పండుగను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నాం. ఈ సందర్భంగా ప్రతి ఇంటిపై హర్ ఘర్ తిరంగా పేరుతో జాతీయపతాకాన్ని ఎగరవేయాలని ప్రధాని పిలుపునిచ్చారు. భారతీయ జనతా యువమోర్చ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా తిరంగా ర్యాలీని తిరంగా యాత్రను నిర్వహిస్తాం. 75 ఏళ్ళ స్వాతంత్ర్య పండుగ సందర్భంగా సుమారు 23 కోట్ల మంది ప్రజలు తమ ఇళ్లపై జాతీయ పతాకాన్ని ఎగరవేశారు. రేపు వచ్చే స్వతంత్ర దినోత్సవం రోజు కూడా అదే స్ఫూర్తిని కొనసాగించాలని ప్రధాని పిలుపునిచ్చారు. అందులో భాగంగానే భారత ప్రభుత్వం తరపున రాష్ట్ర ప్రభుత్వాలా తరపున ఈ కార్యక్రమాన్ని నిర్వహించబోతున్నాం. స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థి సంఘాలు ఈ తిరంగా ర్యాలీలో పాల్గొని దేశ




సమగ్రత దేశ సమైక్యత కాపాడి స్వాతంత్ర ఉత్సవాలకు సంబంధించిన చరిత్ర ప్రపంచానికి యువతరానికి చెప్పాల్సిన బాధ్యత ఉంది. నేటి నుంచి 15వ తేదీ వరకు ఈ ఉత్సవాలు తిరంగా యాత్ర కొనసాగనున్నాయి. ఈ సందర్భంగా తెలుగు ప్రజలని కోరుతా ఉన్నాను దేశ స్వాతంత్ర పండుగలో భాగస్వాములు కండి ప్రతి ఒక్కరు జాతీయ పతాకాన్ని తమ ఇంటిపై ఎగరవేయాలని కోరుతున్నాను.

# రూ.850 కోట్ల విలువైన రేడియోధార్మిక పదార్థం స్వాధీనం

- నలుగురు నిందితుల అరెస్ట్

బీహార్: బీహార్ పోలీసులు నలుగురు సభ్యుల స్మగ్లింగ్ ముఠా గుట్టును రట్టు చేశారు. నిందితుల నుంచి 50 గ్రాముల రేడియోధార్మిక పదార్థం 'కాలిఫోర్నియం'ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేశారు. ఈ పదార్థం ధర గ్రాముకు రూ.17 కోట్లుగా అంచనా ఏశారు. అంటే రూ.850 కోట్ల సరుకు ఇది. అణువిద్యుత్ ప్లాంట్ల నుంచి క్యాన్సర్ చికిత్స వరకు అన్నింటిలోనూ దీన్ని వినియోగిస్తారు. గోపాల్గంజ్ ఎస్పీ స్వర్ణ ప్రభాత్ ఈ మెటల్ రికవరీని ధ్రువీకరించారు. నిందితులు మోటారు సైకిల్ పై ప్రయాణిస్తుండగా వారి వద్ద నాలుగు మొబైల్ ఫోన్లు, 50 గ్రాముల కాలిఫోర్నియా ఉన్నట్టు గుర్తించి, పట్టుకున్నామని తెలిపారు. స్మగ్లర్లు ఈ విలువైన పదార్థాన్ని విక్రయించడానికి చాలా నెలలుగా ప్రయత్నిస్తున్నారు. ఉత్తరప్రదేశ్ లోని ఖుషినగర్ జిల్లాలోని తమ్కుహి రాజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పర్సౌని బుజుర్గ్ గ్రామానికి చెందిన



ఛోటే లాల్ ప్రసాద్ (40), కౌశల్య చౌక్లో నివాసం ఉంటున్న చందన్ గుప్తా (40), గోపాల్ గంజ్ లోని నగర్ పోలీస్ స్టేషన్ ప్రాంతంలో నివాసం ఉంటున్న చందన్ రామ్, గోపాలంజుకు చెందిన కుషహర్ మధియాను అరెస్టు చేశారు.

# యువత సొంత కాళ్లపై నిలబడేలా చేయడమే అసలైన సంక్షేమం

- విద్య, వైద్యం ఉచితంగా అందిస్తే చాలు
- ఇంకే ఉచితాలు అవసరం లేదు
- భారత పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు
- యువతరం ఆరోగ్యకర జీవనశైలిని అలవర్చుకోవాలని సూచన
- స్వర్ణభారత్ ట్రస్ట్ విజయవాడ చాప్టర్ లో ఉచిత వైద్య శిబిరం






విజయవాడ,

ప్రజలకు విద్య,వైద్యం ఉచితంగా అందిస్తే చాలని, మరింకే ఉచిత పథకాలు అవసరం లేదని భారత పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు అన్నారు. స్వర్ణ భారత్ ట్రస్ట్ విజయవాడ చాప్టర్ ఆత్కూర్లో ఆదివారం గుడివాడకు చెందిన ఈవిఆర్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వెంకయ్య నాయుడు మాట్లాడుతూ వివిధ ప్రభుత్వాలు ఓట్ల కోసం, తాత్కాలిక రాజకీయ లబ్ధి కోసం అవసరం లేని ఉచిత పథకాలు తీసుకొస్తున్నాయని, దీనివల్ల ప్రజలకు దీర్ఘకాలికంగా లాభం కంటే నష్టమే ఎక్కువ జరుగుతుందని అన్నారు.

"ఆకలితో ఉన్న వ్యక్తికి చేపలు ఇస్తే అప్పటికి తృప్తి చెందుతాడు. అదే వ్యక్తికి చేపలు పట్టడం నేర్పిస్తే, తాను ఎప్పుడు కావాలంటే అప్పుడు చేపలు పట్టుకోగలడు. ఇదీ అసలైన సంక్షేమం అంటే. యువత తమ కాళ్ళపై తాము నిలబడ గలిగేలా నైపుణ్య శిక్షణ ఉచితంగా అందిస్తే ఆత్మగౌరవంతో బతకగలరు. లేదంటే ఎప్పుడూ చేయి చాచే పరిస్థితిలోనే ఉంటారు. ఇది నిజమైన సంక్షేమం కాదు. ప్రజలు చేయి చాచే పరిస్థితిలో లేకుండా ఆత్మగౌరవంతో జీవించేలా చేయడమే అసలైన సంక్షేమం. ప్రభుత్వాలు ఈ దృష్టి కోణంలో ఆలోచించాలి." అని సూచించారు. తల్లిదండ్రులు ఆరోగ్యకర జీవనశైలిని అలవర్చుకోవటంతో పాటు, పిల్లలకు అలవాటు చేయాలని వెంకయ్య నాయుడు సూచించారు. పాశ్చాత్య జీవనశైలి మోజును విడనాడి ఆరోగ్య కరమైన భారతీయ జీవనశైలికి మారాలన్నారు. సూర్యోదయం పూర్వమే నిద్ర లేవడంతోపాటు తగిన శారీరక శ్రమ చేయాలని సూచించారు.

యోగ, వ్యాయామం, ఆటలు వంటి శారీరక శ్రమతో, తాజాగా వండిన సంప్రదాయ భారతీయ వంటకాలతో శరీరం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. రాత్రి త్వరగా నిద్రపోవాలని, టీవీలు, ఫోన్లు ఎక్కువగా చూడకూడదని చెప్పారు. టీవీలు, ఫోన్ల వాడకం పెరిగితే మనసులో అలజడి చెలరేగుతుందని, మానసిక అశాంతి పెరుగుతుందని స్పష్టం చేశారు.

శరీరం మనసు రెండిటికి,పరస్పర సంబంధం ఉందని, శరీరం ఆరోగ్యంగా ఉంటే, మనసు ఆరోగ్యంగా ఉంటుందని, మనసు ఆరోగ్యంగా ఉంటే శరీరం ఆరోగ్యంగా ఉంటుందని చెప్పారు. అమ్మమ్మలు, నాయనమ్మలు, తాతయ్యలతో పిల్లలు ఎక్కువగా సమయం గడపాలని, వారు ఎన్నో విలువైన జీవిత పాఠాలు నేర్పిస్తారని, కుటుంబ బంధాలు మరింత మెరుగుపడతాయని చెప్పారు. స్వర్ణ భారత్ ట్రస్ట్ 23 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు చేపడు తోందని చెప్పారు. ఉచిత వైద్య సేవలు అందించడంతోపాటు,యువతకు నైపుణ్య శిక్షణ అందిస్తోందని, దీనివల్ల యువతరం నాలుగు నెలల్లోనే ఆత్మవిశ్వాసంతో తమ కాళ్లపై తాము నిలబడి కుటుంబానికి అండగా ఉంటున్నారని చెప్పారు. స్వర్ణ భారత్ ట్రస్ట్ విజయవాడ చాప్టర్, ఆత్కూరులో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం సంతోషకరమన్నారు. ఈ శిబిరంలో పాల్గొని సేవలందించిన గుడివాడ ఈవిఆర్ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రికి చెందిన గుండె, మెదడు, నరాలు, క్యాన్సర్, ఉదరకోశ వైద్య నిపుణులకు అభినందనలు, ధన్యవాదాలు తెలియజేశారు. వైద్య సలహాల కోసం వచ్చిన వారికి ఉచిత వైద్య పరీక్షలతో పాటు, ఉచిత భోజన సదుపాయం, వారానికి సరిపడా ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న స్వర్ణ భారత్ ట్రస్ట్ నిర్వాహకులకు అభినందనలు తెలియజేశారు.

# 100 రకాల పిండి వంటలతో అల్లుడికి మర్యాద

(వెంకటాచారి)

కాకినాడ: ఆషాడం ముగిసిన తర్వాత తొలిసారి ఇంటికి వచ్చిన అల్లుడికి 100 రకాల పిండి వంటలు చేసి పెట్టిన అత్తామామలు.. కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం తామరాడ గ్రామానికి చెందిన రత్న కుమారికి కాకినాడకు చెందిన రవి తేజకు గత ఏడాది సెప్టెంబర్‌లో వివాహం జరిగింది.
వివాహమై ఆషాడ మాసం ముగిసిన తర్వాత శ్రావణ మాసంలో తొలిసారిగా అత్త వారింటికి వచ్చిన అల్లుడికి అత్తమామలు 100 రకాల పిండి వంటలతో భోజన ఏర్పాట్లు చేశారు. అత్తగారు 100 రకాల పిండి వంటలు చేయడం పట్ల అల్లుడు రవితేజ ఆనందం వ్యక్తం చేస్తున్నాడు.



7

జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || సోమవారం 12, ఆగస్టు 2024

## ఫుల్లుగా తాగి రైల్వే ట్రాక్‌పై నిద్రపోయాడు..

యూపీ: పీకలదాకా తాగిన ఓ వ్యక్తి రైల్వే పట్టాల మధ్యలో నిద్రపోయాడు. అదే ట్రాక్‌లో రైలు వెళ్లినా చలించలేదు. అతడిని గమనించిన లోకోపైలట్ పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి చూసే సమయానికి అతను ఇంకా నిద్రిస్తూనే ఉండటం, గాయాలు కాకపోవడంతో పోలీసులు షాకయ్యారు. ఈ ఘటన యూపీలోని బిజ్నోర్లో జరిగింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరలవుతోంది. అతడికి భూమి మీద ఇంకా నూకలు ఉన్నాయని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.



## శంషాబాద్ ఎయిర్ పోర్టులో భారీగా బంగారం పట్టివేత

హైదరాబాద్,మహానాడు:
శంషాబాద్ ఎయిర్ పోర్టులో భారీగా బంగారం పట్టుబడింది.. 13 వందల 90 గ్రాముల బంగారాన్ని డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దుబాయ్ నుంచి వస్తున్న ప్రయాణికుడికి వద్ద.. బూట్లు, బ్యాగులో బంగారం దొరికిందన్నారు. బంగారం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేశారు.పట్టుకున్న బంగారం విలువ కోటి రూపాయలు ఉంటుందని డీఆర్ఐ అధికారులు వివరించారు.



## సిరిసిల్ల జిల్లాలో మగవారిపై కాకుల దాడి

(జానకీదేవి, తణుకు)

సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మగవాళ్లపై కాకులు పగ బట్టాయి. కేవలం మగవాళ్ల తలపై కాళ్లతో తన్నుతూ కాకులు దాడి చేస్తున్నాయి. విచిత్రంగా ఉన్నా నమ్మి తీరాల్సిందే. ఇందుకు సంబంధించిన వీడియోసైతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

ఈ ఘటన సిరిసిల్ల జిల్లా కేంద్రం లో ఈరోజు ఉదయం చోటు చేసుకుంది. సిరిసిల్ల పాత బస్టాండ్‌లో కట్ట మైసమ్మ గుడివద్ద తిరుగుతున్న మగవాళ్లపై కాకులు కాళ్లతో దాడి చేస్తున్నాయి.బస్టాండ్ నుంచి బయటకు వెళ్లే వారిపై, లోపలికి వచ్చే మగవాళ్లను మాత్రమే తలపై తన్నుతూ చెట్టు కొమ్మపైకి వెళ్లి వాలుతు న్నాయి. ఇందుకు సంబంధించిన వీడియోను చూసిన నెటిజన్లు ఆశ్చర్య పోతున్నారు. అక్కడి కాకులు మగవాళ్ల పైనే ఎందుకు దాడిచేస్తున్నాయంటూ ఆశ్చర్యపడు తున్నారు.





మాజీ మంత్రి కామినేని శ్రీనివాసరావు విజయవాడలో నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి హాజరయిన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు. చిత్రంలో ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు, గద్దె రామ్మోహన్‌రావు, బోడె ప్రసాద్ తదితరులు.

## శ్రీవారి సేవలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

తిరుపతి: తిరుమల శ్రీవారిని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కుటుంబ సమేతంగా ఈరోజు తెల్ల వారు జామున దర్శించుకున్నారు. దర్శనానంతరం రంగనా యకుల మండపంలో పండితులు వేద ఆశీర్వ చనం పలకగా...ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు. రెండు రాష్ట్రాల ప్రజలు పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని శ్రీవారిని ప్రార్థించినట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు.



# ఆక్వా కేపిటల్‌గా ఏపీని మారుస్తాం..

- మత్స్య కారుల ఆదాయం పెంచేలా మథర్ షిప్ వ్యవస్థ
- సీడ్ కోసం ఇప్పటికీ పొరుగు రాష్ట్రాలకు వెళ్లాల్సిన దుస్థితి
- జగన్ ఐదేళ్ల పాలనలో ఎన్ఎఫ్‌డీబీ నుండి రూపాయి కూడా తీసుకురాలేకపోయారు
- బందరులో మెరైన్ యూనివర్శిటీ ఏర్పాటుకు కృషి
- ఫిషింగ్ హార్బర్లో వాతావరణ పరిస్థితుల్ని అధికారులతో కలిసి పరిశీలించిన మంత్రి కొల్లు రవీంద్ర



మచిలీపట్నం, మహానాడు:
మచిలీపట్నాన్ని రాష్ట్రానికి ఆక్వా కేపిటల్‌గా మార్చి తీరుతానని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఈ మేరకు గిలకలదిండి ఆదివారం ఫిషింగ్ హార్బర్లో వాతావరణ పరిస్థితులు, ఫిషింగ్ కోసం మత్స్యకారులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల్ని గ్లోబల్ ఎన్విరాన్ మెంటల్‌కు చెందిన ఏడుగురు సభ్యుల బృందంతో పరిశీలించారు. మచిలీపట్నాన్ని ఆక్వాహబ్‌గా మార్చేందుకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నట్టు తెలిపారు.

మత్స్య ఉత్పత్తులకు మచిలీపట్నం పెట్టింది పేరు అన్నారు. అప్పట్లో నడకుదిటి నరసింహారావు మంత్రిగా ఉన్న సమయంలో నిర్మించిన భవనంలోనే నేడు సమీక్ష ఏర్పాటు చేసుకున్నాం. మత్స్యకారుల ఆదాయం పెంపునకు ఉండే అవకాశాలను సమగ్రంగా అధ్యయనం చేస్తున్నామన్నారు. తీర ప్రాంతానికి రక్షణగా నిలిచే మడ అడవుల్ని జగన్ రెడ్డి అధికారంలో ఉన్నపుడు దారుణంగా నాశనం చేశారన్నారు. వారు చేసిన విధ్వంసం కారణంగా మత్స్యకారులు ఎక్కువగా నష్ట పోతున్నారన్నారు. మత్స్య సంపద ఎదుగుదలకు మడ అడవులు ఎంతో కీలకమని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.

సంప్రదాయ వనరుల స్థానంలో పునరుత్పాదక ఇందన వినియోగానికి ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నామన్నారు. ఇప్పటికే చాలా దేశాల్లో సోలార్ పవర్డ్ బోట్స్ అందుబాటులోకి వచ్చాయని, మనం కూడా ఆ సాంకేతికతను వినియోగించుకోవడానికి ప్రయత్నించాలన్నారు. అదే సమయంలో రవాణా, ఎగుమతుల సమయంలో జరుగుతున్న ప్రమాదాల్లో మత్స్యకారులు తీవ్రంగా నష్టపోతున్నారని, అందులోనూ నూతన ప్రయత్నాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సీడ్‌కు వ్యాధుల నివారణ కోసం ప్రత్యేక చర్యలు అవసరం అన్నారు. చిన్న చిన్న పడవల్లో వేటకు వెళ్లే వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారి సమస్యలు పరిష్కరించేందుకు మథర్ షిప్ వ్యవస్థను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. తద్వారా ఒకసారి వేటకు వెళితే ఎన్ని రోజులున్నా.. వారికి అవసరమైన ఇంధనం, ఐస్ లాంటివన్నీ ఆ మథర్ షిప్ నుండి పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. సీడ్ విషయంలో కేంద్ర ప్రభుత్వ సహకారం తీసుకోవాలని భావిస్తున్నామన్నారు. రాష్ట్రాన్ని మత్స్యరంగంలో అగ్రస్థానంలో నిలిపే అవకాశం ఉన్నదన్నారు.

కేంద్ర మంత్రుల్ని కలిసి రాష్ట్ర అభివృద్ధి, మచిలీపట్నం అభివృద్ధికి నివేదికలు సిద్ధం చేసినట్టు తెలిపారు. విజయవాడ - మచిలీపట్నం హైవే నిర్మాణానికి గతంలో గడ్కరీ సహకరించారు. ఇప్పుడు సాగరమాల పథకంలో భాగంగా సముద్ర తీరానికి 500 మీటర్ల దూరంలో హైవే ఏర్పాటు, మచిలీపట్నం-రేపల్లె రైల్ మార్గం ఏర్పాటు, మచిలీపట్నంలో టూరిజం అభివృద్ధి, బ్యాక్ వాటర్స్ ద్వారా పర్యాటకాభివృద్ధికి కేంద్ర సహకారం కోరతామన్నారు.

జగన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో ఫిషింగ్ హార్బర్ అంచనాలు పెంచడం తప్ప చేసిందేమీ లేదన్నారు. బందరు పోర్టు, ఫిషింగ్ హార్బర్ల పరిశీలనకు త్వరలో రాష్ట్ర మంత్రులు, కేంద్ర మంత్రులు రాబోతున్నారని, వీలైనంత త్వరగా వాటిని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని మంత్ర కొల్లు రవీంద్ర తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మత్య శాఖ కమిషర్ తమ్ము డోలా శంకర్, అదనపు డైరక్టర్ డా.అంజలి, మత్య శాఖ జేడీ ఏ.చంద్రశేఖర్, జిల్లా అటవీ అధికారి కే.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## పొదుపులో ఏపీ దేశంలోనే నెంబర్‌వన్

NABARD

- నాబార్డు నివేదిక

అమరావతి,
ఆంధ్రప్రదేశ్ డ్వాక్రా సంఘాల పొదుపులో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. 2023-24 మార్చికి అన్ని రాష్ట్రాల పొదుపు రూ. 65,084cr కాగా దక్షిణాది పొదుపు రూ 29,409 కోట్లు, ఇందులో ఏపీ పొదుపు రూ 17,292cr. ఇది దేశంలోనే అత్యధికం. ఆ తర్వాత తెలంగాణ (రూ 5,768 కోట్లు), తమిళనాడు (రూ2,854 కోట్లు) కర్ణాటక (రూ 2,024 కోట్లు) ఉన్నాయి. అలాగే ఏపీలో పొదుపు సంఘాలు 10,99,161 ఉండగా, ఒక్కో సంఘం సగటు పొదుపు 1,57,321. ఇది దేశంలోనే అత్యధికమని నాబార్డు నివేదికలో వెల్లడైంది.



# 15 నుంచి గ్రామ రెవెన్యూ సదస్సులు

- రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా
- 45 రోజుల పాటు నిర్వహణ .. మరో 45 రోజుల్లో పరిష్కారం
- వైసీపీ భూ కబ్జాలు, రీ సర్వేతో వచ్చిన కష్టాలూ చెప్పుకోవచ్చు
- ప్రజల నుంచి 5 కేటగిరీల్లో పిటిషన్ల స్వీకరణ
- ఆర్టీజీఎస్ పరిధిలో ప్రత్యేక విభాగంతో పర్యవేక్షణ

అమరావతి, మహానాడు:
జగన్ ప్రభుత్వం రాష్ట్రంలో పెట్టిన భూ వివాదాల చిచ్చును పరిష్కరించేందుకు చంద్రబాబు ప్రభుత్వం నడుం బిగించింది. 'ప్రజల వద్దకే పాలన' తరహాలో ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని నిర్ణయించింది. ఎక్కడికక్కడ అధికారులు భూ సమస్యలను తెలుసుకుంటారు. ఆగస్టు 15వ తేదీ నుంచి 45 రోజులపాటు ఈ కార్యక్రమం జరుగుతుంది. మరో 45 రోజుల్లో సమస్య పరిష్కారంపై దృష్టి సారిస్తారు. గత ఐదేళ్లలో పేదలు, బడుగువర్గాలు, అణగారిన వర్గాల భూములను వైసీపీ నేతలు దౌర్జన్యంగా ఆక్రమించుకొని రికార్డులను తారుమారుచేసి వారికి నరకం చూపించారు. ఉద్దేశపూర్వకంగా వెబ్‌ల్యాండ్‌లో చిన్న, చిన్న మార్పులు చేసి ప్రజలను హింసించారు. కొత్త ప్రభుత్వం వచ్చాక స్వీకరిస్తోన్న వినతిపత్రాల్లో సగానికిపైగా భూ వివాదాలపైనే ఉంటున్నాయి.

పేదల నోటికాడి ముద్దను తీసేసినట్లవుతుందని భావించిన ప్రభుత్వం తక్షణమే ఆ సమస్యల పరిష్కారానికి నడుం బిగించింది. 45 రోజులపాటు ఊరూరు తిరిగి అధికార యంత్రాంగాన్ని మోహరించి ఎక్కడికక్కడే సమస్యలు తెలుసుకోవడం, ఆ తర్వాత 45 రోజుల్లో వాటికి పరిష్కారం చూపడం...ఇదే ప్రస్తుత టార్గెట్. ఈ నెల 15న మంత్రులు లాంఛనంగా గ్రామ రెవెన్యూ సదస్సులు ప్రారంభిస్తారు. ఆ తర్వాత 16 నుంచి సెప్టెంబరు నెలాఖరు వరకు అంటే 45 రోజుల పాటు సదస్సులు నిర్వహించనున్నారు. జిల్లాలు, మండలాల వారీగా గ్రామాల్లో సదస్సుల నిర్వహణ తేదీలను 13నాటికే ఖరారు చేయాలని కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. సదస్సుల నిర్వహణ, పర్యవేక్షణ కోసం ప్రతి జిల్లాకు ఓ సీనియర్ ఐఏఎసను ప్రత్యేక అధికారిగా నియమిస్తారు. జేసీ నోడల్ అధికారిగా వ్యవహరించనున్నారు. ఈ సదస్సుల్లో జిల్లా మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, జడ్పీ చైర్మన్, సభ్యులు, మండల, గ్రామ ప్రజాప్రతినిధులు పాల్గొనేలా కలెక్టర్‌లు తగిన చొరవ తీసుకోవాలని రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా ఆదేశించారు.

ఎవరెవరు పాల్గొంటారంటే..

తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, గ్రామ రెవెన్యూ అధికారి, మండల సర్వేయర్, దేవదాయ, వక్ఫ్ శాఖల ప్రతినిధులు, రిజిస్ట్రేషన్‌శాఖ అధికారి, అటవీ శాఖ అధికారి. సున్నితమైన భూసమస్యలపై సదస్సులు నిర్వహిస్తున్నందున కార్యక్రమం పూర్తయ్యేవరకు పోలీసులతో భద్రత ఏర్పాటు చేస్తారు.

### సదస్సుల్లో ఏం చేస్తారంటే..

గ్రామ రెవెన్యూ సదస్సుకు రెండు రోజుల ముందే ప్రభుత్వం గ్రామ రెవెన్యూ మ్యాప్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తుంది. ప్రభుత్వ, ప్రైవేటు భూముల మ్యాప్‌లను ప్రకటిస్తుంది. సదస్సులకు రెవెన్యూ, రిజిస్ట్రేషన్, అటవీ, దేవదాయ, వక్ఫ్ శాఖల మండల, గ్రామస్థాయి అధికారులు హాజరవుతారు. భూ కొలతల్లో తేడాలు, సర్వేనెంబర్లలో మార్పులు, వారసత్వం పేర్ల నమోదు, సరిహద్దు సమస్య, భూ విస్తీర్ణంలో తేడాలు, రీసర్వే జరిగిన గ్రామాల్లో రైతులకు ఇచ్చిన రికార్డుల్లో నమోదైన తప్పులు, ప్రజల నుంచి వైసీపీ నేతలు లాక్కున్న భూములు, భూ కబ్జాలు, భూ ఆక్రమణలు, అసైన్డ్, చుక్కల భూముల పరాధీనం వంటి తదితరాలపై బాధితుల నుంచి పిటిషన్లు తీసుకుంటారు.

2019కి ముందు భూమి రికార్డులు ఎలా ఉన్నాయి? ఇప్పుడెలా ఉన్నా యో పరిశీలిస్తారు. అడంగల్, పహనీ, ఆర్ఓఆర్, 1బీ రిజిస్టర్, 22(ఏ) జాబితాలను అందుబాటులో ఉంచుతారు. వాటిపై ప్రజల నుంచే వచ్చే ఫిర్యాదులను స్వీకరిస్తారు. తహసీల్దార్ల నేతృత్వంలో అవసరమైతే భూములను పరిశీలన చేస్తారు. రీ సర్వే జరిగిన గ్రామాల్లో ఆర్ఓఆర్ రికార్డును ప్రజల సమక్షంలో చదివి వినిపించాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. కొత్త పాస్‌పుస్తకాలు ఇచ్చేందుకు జగన్ బొమ్మలున్న పాస్‌పుస్తకాలను వెనక్కి తీసుకోవాలని సూచించింది. జగన్ బొమ్మలున్న పాస్ పుస్తకాలను తహసీల్దార్లు ధ్వంసం చేయాలని రెవెన్యూ స్పెషల్ సీఎస్ సిసోడి యా మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. గ్రామంలో జగన్ పేర్లు, బొమ్మలతో సర్వేరాళ్లు ఉంటే, వాటిపై పేర్లను చెరిపి వేయాలని నిర్దేశించారు.

### ఐదు కేటగిరీలుగా..

ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ఐదు రిజిస్టర్లలో నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. మ్యుటేషన్, కౌలు రైతు కార్డులు(ఎల్ఈసీ), భూమి వివాదాలు, భూ ఆక్రమణ, నిషేధ జాబితా 22(ఏ) గోల్‌మాల్ రిజిస్టర్లను నిర్వహిస్తారు. వీటిలో నమోదుచేసి, ఆ తర్వాత ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు. వీటిని ఆర్టీజీఎస్ విభాగం పర్యవేక్షిస్తుంటుంది. ఫిర్యాదు ఇచ్చిన ప్రజలకు వెంటనే ఓ రశీదు ఇస్తారు.

### 90 రోజుల టార్గెట్: ఆర్పీ సిసోడియా

ఈ నెల 15నుంచి సెప్టెంబరు నెలాఖరు వరకు సదస్సులు నిర్వహించి ప్రజల నుంచి పిటిషన్లు స్వీకరిస్తారు. ఆ తర్వాత మరో 45 రోజుల్లో అంటే నవంబరు 15 నాటికి వాటిని పరిష్కరించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. పిటిషన్ల స్వీకరణ, పరిష్కారం 90 రోజుల్లోనే పూర్తిచేయాలనేది లక్ష్యం. ఇందుకోసం రాష్ట్రస్థాయిలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయనుంది. పిటిషన్ల స్వీకరణ, పరిష్కారంపై రోజువారీగా సమీక్ష చేయనున్నారు. అర్జీదారుకు ఫోన్‌చేసి పరిష్కారంపై వివరించాలని ఆదేశించారు. పర్యవేక్షణకు ఆర్టీజీఎస్ పరిధిలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయనున్నారు.

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ | సోమవారం 12, ఆగస్టు 2024

## రేషన్ బియ్యం తరలిస్తున్న అక్రమార్కులు

గంపలగూడెం మండలం (ఎన్టీఆర్ జిల్లా):

ప్రభుత్వాలు మారినా అక్రమార్కుల తీరు మారడం లేదు. ప్రజా పంపిణీ వ్యవస్థలో భాగంగా ప్రభుత్వం పేదలకు బియ్యం అందజేస్తున్న విషయం తెలిసిందే.ఆ బియ్యాన్ని కొందరు అక్రమ వ్యాపారులు సొమ్ము చేసుకుంటూ లక్షలు గడిస్తున్నారు.అందులో భాగమే శనివారం రాత్రి ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం ఊటుకూరులో అక్రమంగా, తరలిస్తూ, పోలీసులకు పట్టుబడ్డారు.

స్థానిక ఎస్సై ఎస్ శ్రీనివాస్ తెలిపిన వివరాలు ప్రకారం నెమలి నుండి మధిర వైపుకు తరలిస్తుండగా, రెండు టాటా ఏసీల్లో బియ్యాన్ని తరలిస్తూ, పట్టుపడ్డారని చెప్పారు. వాహనాల తనిఖీలో భాగంగా ఈ విషయం వెల్లడైందన్నారు.



రెండు వాహనాల్లో 40 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు వివరించారు. సదరు వాహనాలను వశపరచుకొని స్టేషన్లో భద్రపరిచారు. ఈ విషయమై కేసు నమోదు చేస్తామని ఎస్సై శ్రీనివాస్ వివరించారు.

## కృష్ణా, గోదావరి సంగం వద్ద హారతులు పున: ప్రారంభం

- అంతరాలయంలో శ్రీదుర్గమ్మ తల్లి వీడియోగ్రఫీ చేస్తే కఠిన చర్య
- రూ.113 కోట్ల సి.జి.ఎఫ్.నిధులతో 160 దేవాలయాల ఆధునీకరణ
- ధూప దీప నైవేద్యాలకి ప్రస్తుతం ఇచ్చే రూ.5 వేలను రూ.10 వేలకు పెంపు
- రెవిన్యూ సదస్సుల్లో దేవాదాయ భూములపై కూడా ఫిర్యాదులు స్వీకరణ
- రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

అమరావతి, మహానాడు:

గతంలో కృష్ణా, గోదావరి పవిత్ర సంగం వద్ద జరిగే జల హారతులను పునఃప్రారంభించనున్నట్లు రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ దుర్గమ్మ తల్లి అంతరాలయంలో వీడియోగ్రఫీ చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రూ.113 కోట్ల సి.జి.ఎఫ్.నిధులతో 160 దేవాలయాల ఆధునీకరణ పనులను చేపడుతున్నామన్నారు. ధూప దీప నైవేద్యాలకై ప్రస్తుతం ఇచ్చే రూ.5 వేలను రూ.10 వేలకు పెంపుచేస్తున్నామన్నారు. రెవిన్యూ సదస్సుల్లో దేవాదాయ భూములపై కూడా ఫిర్యాదులు స్వీకరిస్తారని, రాష్ట్ర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని దేవాదాయ భూముల పరిరక్షణకు సహకరించాలన ఆయన విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర సచివాలయంలో వారికి కేటాయించిన ఛాంబరు ఆధునీకరణ అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛారణ మధ్య కుటుంబ సభ్యులతో ఆదివారం ఉదయం ఛాంబరులోకి ప్రవేశించారు. ఆ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, ఇతర అధికారులు పుష్పగచ్ఛాలు అందజేస్తూ ఘనంగా స్వాగతం పలికారు. సీటులో ఆసీనులైన తర్వాత రెండు ముఖ్యమైన ఫైళ్లపై మంత్రి తొలి సంతకం చేశారు. ఇందులో ఒకటి రూ.113 కోట్ల సి.జి.ఎఫ్. నిధులతో రాష్ట్రంలోని 160 దేవాలయాల ఆధునీకరణ పనులకు సంబందించినది కాగా, మరొకటి తూర్పు గోదావరి జిల్లా మండపేటలో నున్న శ్రీ అగస్త్యేశ్వర స్వామి దేవాలయాన్ని రూ.1 కోటి సి.జి.ఎఫ్. నిధులతో ఆధునీకరించే పనులకు సంబంధించినది. ఈ 160 దేవాల యాల్లో 147 ప్రాధాన్యత దేవాలయాలు మైదాన ప్రాంతాల్లోవి కాగా మిగిలిన 13 దేవాలయాలు వెనుకబడిన, గిరిజన ప్రాంతాలోనివి.

ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో సుపరిపాలన దిశగా తమ ప్రభుత్వం అడుగుల వేస్తోందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చే విధంగా, భక్తులకు ఆ భగవంతుని ఆశీస్సులు ఉండే





విధంగా, భగవంతుని ఆస్తులను పరిరక్షించే విధంగా ఎల్లప్పుడు సంసిద్ధులుగా ఉండటమే తమప్రథమబాధ్యత, కర్తవ్యంఅన్నారు.

గత ప్రభుత్వ పాలనలలో తిరుమల నుండి ఉత్తరాంధ్రలోని అరసవిల్లి వరకూ దేముని ఆస్తులను కూడా వదలని పరిస్థితులు అనేకం మీడియా ముఖంగా వెలువడిన పరిస్థితి అందరికీ తెలుసన్నారు. ఈ విషయంలో ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుని చర్యలు చేపట్టాల్సిన గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. కానీ తామ అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఎటు వంటి ఆరోపణవచ్చినా సరే వెంటనే నివేదికలు తెప్పించుకుని బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు బాధ్యతలు చేపట్టబోయేముందు తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్న తదుపరి ఈ తిరుమల నుండే ప్రక్షాళన మొదలు పెడతాం అని చెప్పిన విధంగా దేవాదాయ శాఖ ప్రక్షాళనను కూడా తిరుమలే నుండే ప్రారంభించడం జరిగిందన్నారు. యువగళం పాద యాత్రలో నారా లోకేష్ తెలుసుకున్న అంశాలు మరియు ప్రజా గళం, యువగళం కార్యక్రమంలో వచ్చిన వినతులకు అనుగుణంగా దేవాదాయ శాఖ తగుచర్యలు చేపట్టడం జరిగిందన్నారు.

దేవాదాయ శాఖ ఆధీనంలో మొత్తం 27,105 దేవాలయాలు ఉన్నాయని, వీటిలో 6(ఎ) ఆలయాలు 236 ఉన్నట్లు మంత్రి తెలిపారు. అదే విధంగా ఈ శాఖ పరిధిలో మొత్తం 4,65,000 ఎకరాల భూమి ఉందని, ఆ భూమి ఏ మాత్రం అన్యాక్రాంతం కాకుండా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. దేవాదాయ శాఖ పరిధిలో మొత్తం 20,839 మంది సిబ్బంది ఉన్నారని, వారిలో మత పరంగా 11,142 మంది, పాలనా పరంగా 9,697 మంది పనిచేస్తున్నారన్నారు. మొత్తం 1,234 ట్రస్టు బోర్డులు ఉన్నాయని, వీటిలో పలు కారణాల వల్ల కొన్ని ఖాళీగా ఉన్నాయని, మరో 462 నూతన బోర్డులను ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు.

గత ప్రభుత్వం హారతులు ఇచ్చే పవిత్ర కార్యక్రమాన్ని నిలిపివేసిందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఆదేశాల మేరకు మళ్లీ ఆ హారతుల కార్యక్రమాన్ని తమ ప్రభుత్వం పునః ప్రారంభిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇందుకై సోమవారం రాష్ట్ర సచివాలయంలో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తదితరులతో కూడిన మంత్రుల బృందం సమావేశమై హారతులు ఇచ్చే కార్యక్రమంపై తగు చర్యలు తీసుకుంటుదన్నారు.

శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవాలయంలో శ్రీ దుర్గమ్మతల్లి మూల విరాట్ ను ఈ నెల ఏడో తేదీన ఒక వ్యక్తి వీడియోగ్రఫీ చేసినట్టు, సోషల్ మీడియాలో షేర్ చేసినట్లు ఒక మీడియా ఛానల్లో ప్రసారం అయిందని, సాధారణంగా ఏ ఆలయంలో అయినా అంతరాలయంలోని మూల విరాట్‌ను అర్చకులు తప్ప మరెవ్వరూ తాకకూడదు, అంతరాలయంలోని వెళ్ల కూడదు మంత్రి అన్నారు. ఈ విషయాన్ని దేవాదాయ శాఖ తీవ్రంగా పరిగణిస్తూ విచారణ జరిపించి నివేదికతో పాటు సీసీ పుట్టేజీలను విజయవాడలోని పోలీస్ కమిషనర్ కు తగు చర్యకై అందజేసినట్టు తెలిపారు. రాష్ట్రంలో 27,105 దేవాలయాలు ఉన్నాయని, ఆ దేవాలయాల అంతరాలయంల్లోని మూల విరాట్ ను పిక్చరైజ్ చేయవద్దని, ఎవరూ తాకవద్దని విజ్ఞప్తి చేస్తూ అందుకు విరుద్దంగా ప్రవర్తించిన వారిపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుంది మంత్రి హెచ్చరించారు.

దేవాదాయ శాఖ పరిధిలో 50 వేల లోపు ఆదాయం ఉన్న ఆలయాలకు గతంలో ప్రతి నెలా రూ.5 వేలు ఇస్తుంటే, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు దాన్ని రూ.10 వేలకుపెంచుతూ ప్రతిపాదనలను రాష్ట్ర ముఖ్యమంత్రి ఆమోదం కోసం పంపడం జరిగిందని, త్వరలోనే జి.ఓ. కూడా జారీ చేయడం జరుగుతుందన్నారు. ఫలితంగా ప్రతి ఏడాది దాదాపు రూ.32 కోట్లు అదనపు భారం దేవాదాయ శాఖ మీద పడుతుందని అంచనా వేయడం జరిగిందన్నారు.

రెవిన్యూ శాఖ పరంగా ప్రజలకు ఉన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలనే లక్ష్యంతో రెవిన్యూ సదస్సులను ఆగస్టు 15న ప్రభుత్వం లాంఛనంగా ప్రారంభిస్తున్నట్టు మంత్రి తెలిపారు. అన్ని రెవిన్యూ గ్రామాల్లో ఈ సదస్సులను నిర్వహించనున్నట్టు తెలిపారు. దేవాదాయ శాఖ జాయింట్ కమిషనర్ ఆజాద్, డిప్యూటీ కమిషనర్ రతన్ రాజు తదితర అధికారులతో పాటు పలువురు అనధికారులు, మంత్రి కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఎయిర్ పోర్టు నిర్మాణం పనులు సంతృప్తికరం

- భోగాపురం ఎయిర్ పోర్టు పనులు 36.6 శాతం పూర్తి
- నెలరోజుల్లో 4.8 శాతం పనులు
- అనుకున్న సమయం కంటే ముందే పూర్తి చేసేందుకు అధికంగా అవకాశాలు
- నిర్మాణం పనుల పురోగతిపై ప్రతి నెలా సమీక్షిస్తాం
- ఉత్తరాంధ్ర రూపురేఖలు మార్చే శక్తి యీ ఎయిర్ పోర్టుకే వుంది : కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు
- రాష్ట్ర మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, గుమ్మడి సంధ్యారాణిలతో కలసి పనుల పరిశీలన
- జి.ఎం.ఆర్., ఎల్ అండ్ టి సంస్థ ప్రతినిధులతో పనులపై కేంద్ర మంత్రి సమీక్ష
- రైల్వేజోన్ ఏర్పాటుకు కేంద్రం సానుకూలం
- త్వరలో ఏర్పాటయ్యే అవకాశం: కేంద్ర మంత్రి వెల్లడి

విజయనగరం, ఆగష్టు 11

జిల్లాలోని భోగాపురం వద్ద నిర్మాణం జరుగుతున్న అంతర్జాతీయ గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయం పనులు జరుగుతున్న తీరును బట్టి అనుకున్న సమయం కంటే ముందుగానే పూర్తిచేయగలమనే నమ్మకం తమకుందని కేంద్ర పౌరవిమా నయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చెప్పారు.

వాస్తవానికి డిశంబరు 2026 నాటికి యీ ఎయిర్ పోర్టు నిర్మాణం పూర్తికావలసి వున్నప్పటికీ ముఖ్యమంత్రి ఎన్.చంద్ర బాబు నాయుడు ఇటీవల భోగాపురం ఎయిర్ పోర్టు పర్యటనకు వచ్చినపుడు నిర్ణీత గడువుకంటే ఆరు నెలలు ముందుగా జూన్ 2026 నాటికి పూర్తిచేయాలని గడువు విధించారని ఆ సమ యానికే పూర్తిచేసే దిశగా వేగవంతంగా పనులు జరుగుతు న్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, గుమ్మిడి సంధ్యారాణి, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవితో కలసి ఆదివారం భోగాపురం ఎయిర్ పోర్టు నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించి పనులను పరిశీలించారు.

జి.ఎం.ఆర్. గ్రూపు డిప్యూటీ మేనేజింగ్ డైరక్టర్ ఐ.ప్రభాకరరావు వారికి పనుల పురోగతిని వివరించారు. కేంద్ర రాష్ట్ర మంత్రులు ముందుగా ఎయిర్ పోర్టు టెర్మినల్ భవనం వద్దకు చేరుకొని పనులను పరిశీలించారు. అక్కడ పనిచేస్తున్న కార్మికులతో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ముచ్చటిం చారు. అనంతరం టెర్మినల్ భవనం మొదటి అంతస్థుపైకి వెళ్లి అక్కడ జరుగుతున్న పనులను తెలుసుకున్నారు.

ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్(ఏటిసి) టవర్ నిర్మాణం పనులను కూడా మంత్రులు పరిశీలించారు. అనంతరం రన్ వే నిర్మాణాన్ని పరిశీలిస్తూ ఎల్ అండ్ టి సంస్థ ప్రాజెక్టు స్థలానికి చేరుకున్నారు. అక్కడ నిర్మాణం పనులపై జి.ఎం.ఆర్. సంస్థ ప్రతినిధులు ప్రజెంటేషన్ ఇచ్చారు.

అనంతరం మంత్రి రామ్మోహన్ నాయుడు మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ నిర్మాణం పనుల పురోగతిని వివరించారు. ప్రతి నెలా పనుల ప్రగతిని సమీక్షించి ప్రజలకు వివరిస్తామని స్పష్టంచేశారు. ఎయిర్ పోర్టు పనులు ఆగష్టు 11 నాటికి 36.6 శాతం పూర్తయ్యాయని మంత్రి వెల్లడించారు. గత నెల జూలై 11 నాటికి 31.8 శాతం పనులు పూర్తికాగా గత నెల రోజుల్లో



అదనంగా 4.8 శాతం పనులు జరిగాయని చెప్పారు.

భారీ వర్షాలు నిరంతరాయంగా కురుస్తున్న సమయం లోనూ ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పనులు నిరాటంకంగా జరపడం వల్ల పనుల్లోయా ప్రగతి సాధ్యమైందని పేర్కొంటూ జి.ఎం.ఆర్.సంస్థ ప్రతినిధులను, ఎల్ అండ్ టి ప్రతినిధులను మంత్రి అభినందించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ యీ ఎయిర్ పోర్టు పనులు అనుకున్న సమయానికంటే ముందుగా పూర్తిచేసేందుకు ప్రత్యేక దృష్టి సారించి కృషిచేస్తున్నాయని చెప్పారు.

వాస్తవానికి ముందు నిర్ణయించిన షెడ్యూలు ప్రకారం యీ సమయానికి 20శాతం పనులు పూర్తికావలసి వుండగా నేడు 36.6 శాతం పూర్తికావడం జరిగిందన్నారు.

ఎయిర్ పోర్టు నిర్మాణంలో ముఖ్యమైన ఎర్త్ వర్క్ పనులు గత నెలలో 97.1శాతం జరుగగా నేటికి 98శాతం పూర్తయి నట్టు చెప్పారు. రన్ వే పనులు గత నెల ఇదే సమయానికి 32శాతం పూర్తికాగా ఈరోజు నాటికి 38.67శాతం పూర్తయినట్టు తెలిపారు. టాక్సీవే పనులు గత నెలలో 16.7 శాతం జరగగా, ఈరోజు నాటికి 20.78శాతం పూర్తయినట్టు పేర్కొన్నారు. టెర్మినల్ భవనం పనులు గత నెలలో 22.5 పూర్తికాగా ఈరోజుకు 27.2 శాతం పూర్తయ్యాయని తెలిపారు. ఏటిసి నిర్మాణం పనులు గత నెలలో 25.58శాతం పూర్తికాగా నేడు 30.69శాతం పూర్తయినట్లు చెప్పారు. సబ్ స్టేషన్లు, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లు వంటి నిర్మాణాలు 6 నుంచి 12 శాతం మేరకు పూర్తయినట్లు తెలిపారు.

ఉత్తరాంధ్ర రూపురేఖలు మార్చేశక్తి భోగాపురం అంతర్జా తీయ విమానాశ్రయానికి వుందని తాను బలంగా నమ్ముతున్నట్టు కేంద్ర మంత్రి చెప్పారు. అందుకే దీనికి అంత ప్రాధాన్యత ఇస్తున్నట్టు మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు పోలవరం ప్రాజెక్టు పనులు చేయించిన స్పూర్తితోనే యీ ఎయిర్ పోర్టు పనులను కూడా శరవేగంగా నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు.

ఉత్తరాంధ్ర ప్రాంతం తమకు ఆదరించి ఎంతో గొప్ప విజయాన్ని అందించిందని, యీ ప్రాంత ప్రజలు తమపై వుంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా ఇక్కడి ప్రాజెక్టులకు అధికంగా ప్రాధాన్యత ఇస్తామని ఇటీవల భోగాపురం పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారని మంత్రి గుర్తుచేశారు.

ప్రధానమంత్రి నరేంద్రమోడి నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం పౌరవిమానయాన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో దేశంలో యీ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ఆర్.సి.ఎస్. ఉడాన్ పథకాన్ని ప్రవేశ పెట్టడం జరిగిందని, యీ పథకం ద్వారా మనదేశ పౌరవిమానయాన రంగం ప్రపంచంలోనే ఉన్నతస్థాయికి వెళ్లే అవకాశం ఉందని కేంద్ర పౌరవిమానయాన మంత్రి కె.రామ్మోహన్ నాయుడు చెప్పారు.

ఏ రంగంలోనూ లేనివిధంగా యీ రంగంలో 16శాతం వృద్ధిరేటు నమోదవుతోందన్నారు. నవీ ముంబాయి, నోయిడా వద్ద నిర్మిస్తున్న కొత్త ఎయిర్ పోర్టులను వచ్చే ఏప్రిల్ నాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. వచ్చే ఐదేళ్లలో పౌరవిమానయాన రంగంలో గణనీయమైన పురోగతి సాధిస్తామన్నారు.

రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎయిర్ పోర్టుల వసతులను గణనీయంగా పెంచేందుకు తమ మంత్రిత్వశాఖ కృషి చేస్తుందని కేంద్ర మంత్రి వెల్లడించారు. మన రాష్ట్రంలోని శ్రీకాకుళం జిల్లా మూలపేట, దగదర్తి, నాగార్జున సాగర్, కుప్పం ఎయిర్ పోర్టులతో పాటు అనంతపూర్, ఒంగోలులో కూడా కొత్త ఎయిర్‌పోర్టులు ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు వున్నాయని, వీటిని పరిశీలిస్తున్నట్టు పేర్కొన్నారు. తెలంగాణలో హైదరాబాద్ మినహా మరో ఎయిర్ పోర్టు లేదని, కొత్తగూడెం, అదిలాబాద్, వరంగల్ వంటి ప్రాంతాల్లో నిర్మాణానికి ప్రతిపాదనలు పరిశీస్తామన్నారు.

విశాఖలో రైల్వే జోన్ అతి త్వరలో ఏర్పాటు కానుందని తాను భావిస్తున్నట్టు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు చెప్పారు. రైల్వే శాఖకు రాష్ట్ర ప్రభుత్వం విశాఖ నగరంలో ఇచ్చేందుకు ప్రతిపాదించిన 52 ఎకరాల స్థలం ఎంతో అనువుగా వుందని, రైల్వే జోన్ ఏర్పాటుకు కేంద్రం సాను కూలంగా వుందని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర అధికారులు సంయుక్తంగా సమావేశమై రైల్వే జోన్ ఏర్పాటుకు ఇచ్చిన స్థలాన్ని పరిశీలించి తదుపరి చర్యలు చేపట్టారని, త్వరలోనే విశాఖ రైల్వేజోన్ పనులు ప్రారంభమవుతాయని ఆశిస్తున్నట్టు చెప్పారు.

ఇప్పటికే తాను, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు యీ విషయమై రైల్వే మంత్రితో చర్చలు జరిపామన్నారు. ఎయిర్ పోర్టు నిర్మాణ ప్రాంతం వద్ద కేంద్ర మాజీ మంత్రి పి.అశోక్ గజపతిరాజు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడును కలిశారు. యీ పర్యటనలో జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్, జి.ఎం.ఆర్. గ్రూపు డిప్యూటీ మేనేజింగ్ డైరక్టర్ ఐ.ప్రభాకర రావు, జిఎంఆర్ విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు లిమిటెడ్ సి.ఇ.ఓ. మన్మోయ్ రాయ్, ప్రాజెక్టు హెడ్ (కార్పొరేట్ రిలేషన్స్) బి.హెచ్.ఏ. రామరాజు, చీఫ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఎం.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ కట్టడాలపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఉక్కుపాదం

హైదరాబాద్,మహానాడు:

హైదరాబాద్ పరిధిలో అక్రమ కట్టడాలపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఉక్కుపాదం మోపుతున్నారు. తాజాగా చందానగర్ పరిధిలోని హాఫీజ్ పేట్ డివిజన్ లో అక్రమ నిర్మాణాలను హైడ్రా అధికారులు నేడు కూల్చివే స్తున్నారు.

వైశాలి నగర్ లోని ప్రభుత్వ భూమిలో మూడు అక్రమ నిర్మాణాలను గుర్తించిన హైడ్రా భారీ బిల్డింగ్‌లను JCBలతో నేలమట్టం చేస్తోంది.



నిన్నటి ఉదయం నుంచి మొదలైన కూల్చివేతలు..ఇవాళ సైతం కొనసాగుతున్నాయి. కూల్చివేత టైమ్‌లో ఎలాంటి ఉద్రిక్తతలు తలెత్తకుండా అధికారులు భారీ బందో బస్తు ఏర్పాటు చేశారు. కాగా, దాదాపు 18 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న బూమ్రు ఖుద్దీన్ దవాళ్ చెరువులో అధికారుల నిర్లక్ష్యంతో బఫర్ జోన్లలో నిర్మాణాలు జోరందుకున్నాయి. దాదాపు 10 ఎకరాల చెరువు భూమిని కబ్జా చేసినట్లు గుర్తించారు. రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు.. మొత్తం 20 ప్రహరీలు, 6 నిర్మాణాలను పటిష్ట పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేతలు చేప ట్టారు. బహదూర్‌పురా ఎమ్మెల్యే ముబిన్ కూల్చి వేతలను నిలిపివేయాలని హైడ్రా సిబ్బందిని అడ్డుకోగా, పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

9
జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ | సోమవారం 12, ఆగస్టు 2024

## ‘వీక్షణం’ ఫస్ట్ లుక్



యువ కథానాయకుడు రామ్ కార్తీక్, కశ్వి జంటగా రూపొందుతోన్న చిత్రం ‘వీక్షణం’. పద్మనాభ సినీ ఆర్ట్స్ బ్యానర్‌పై మనోజ్ పల్లేటి దర్శకత్వంలో పి.పద్మనాభ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను మేకర్స్ ఆదివారం విడుదల చేశారు. చిమ్మచీకటిలో బైనాకులర్స్ నుంచి వస్తోన్న కాంతిలో హీరో రామ్ కార్తీక్ నిలుచుకుని ఉన్నారు. పోస్టర్‌తోనే మేకర్స్ సినిమా కంటెంట్ డిఫరెంట్‌గా ఉండబోతుందనే నమ్మకాన్ని క్రియేట్ చేశారు. ప్రస్తుతం సినిమా చిత్రీకరణను పూర్తి చేసుకుంది. ఫస్ట్ కాపీ కూడా సిద్ధమైంది. సాయిరామ్ ఉదయ్ సినిమాటోగ్రఫీ అందిస్తోన్న ఈ చిత్రానికి సమర్థ్ గొల్లపూడి సంగీతాన్ని అందిస్తున్నారు. త్వరలోనే సినిమాకు సంబంధించిన అప్‌డేట్స్‌ను అందిస్తామని మేకర్స్ తెలియజేశారు.

## రెండుజడల సీతకి అవకాశాలు లేవా?



స్కూల్ యూనిఫాం ధరించి రెండు జడల్ని భుజాల మీదుగా ముందుకు లాగి వదిలింది. స్కూల్‌కి వెళ్లే అమ్మాయి ముంగురులు చెదిరిపోయి గాలికి ఎగురుతున్నాయి. ఆ అందమైన జూకాలు.. మత్తెక్కించే కళ్లు.. ఎక్స్‌ప్రెషన్స్ ఇవన్నీ ఈ ఫోటోషూట్‌లో అదనపు హంగులు.. ఇంతకీ ఎవరీ రెండు జడల సీత? అంటే.. పరిచయం అవసరం లేదు.. ది గ్రేట్ పూజా హెగ్డే. తెలుగు లోగిళ్లలో బుట్టబొమ్మగా పాపులరైన ఈ బ్యూటీ, ఇటీవల కొన్ని వరుస పరాజయాలతో రేసులో వెన్కక్కి తగ్గింది. కానీ కెరీర్ పరంగా ఎలాంటి ఢోఖా లేదు. అటు హిందీ ఇటు తెలుగు చిత్రాల్లో అవకాశాలు అందుకుంటూనే ఉంది. కాంపిటీషన్ ఎంత ఉన్నా తనకు పోటీ అన్నదే లేదని కూడా నిరూపించడం బుట్టబొమ్మ పూజా హెగ్డే ప్రత్యేకత. పూజా స్పెషల్ ఎక్స్‌ప్రెషన్స్ యూనిక్ డ్రెస్ సెన్స్ తో లేటెస్ట్ ఫోటోషూట్ ఇంటర్నెట్ ని షేక్ చేస్తోంది. కెరీర్ మ్యాటర్ కి వస్తే... బాలీవుడ్ అగ్ర హీరో షాహిద్ కపూర్ సరసన దేవా - అనే భారీ యాక్షన్ చిత్రంలో పూజా హెగ్డే నటిస్తోంది. అలాగే కంబ్యాక్ కోసం టాలీవుడ్‌లో దర్శకనిర్మాతలతో మంతనాలు సాగిస్తోందని టాక్ ఉంది. పూజా హెగ్డే కోలీవుడ్‌లో తన కెరీర్‌లో అత్యధిక పారితోషికం తీసుకుంటోందని కూడా ప్రచారం సాగుతోంది. టాలీవుడ్‌లో ప్రతి చిత్రానికి రూ. 2.5 నుండి 3 కోట్ల మధ్య వసూలు చేసి పూజా పారితోషికాన్ని పెంచిందని కోలీవుడ్ మీడియాలో గుసగుస వినిపిస్తోంది. మహేష్ బాబు, ప్రభాస్, జూనియర్ ఎన్టీఆర్, రామ్ చరణ్ , అల్లు అర్జున్ వంటి పెద్ద స్టార్‌లతో కలిసి పని చేసిన పూజా కోలీవుడ్ లో విజయ్ సరసన అవకాశాలు అందుకుంది.

### ఆగస్ట్ 13న ‘సరిపోదా శనివారం’

## మోస్ట్ ఎవైటెడ్ ట్రైలర్



నేచురల్ స్టార్ నాని, డైరెక్టర్ వివేక్ ఆత్రేయ మోస్ట్ ఎవైటెడ్ పాన్ ఇండియా ఫిల్మ్ ‘సరిపోదా శనివారం’ ప్రమోషన్స్ ఫుల్ స్వింగ్ లో జరుగుతున్నాయి. పోస్టర్లు, గ్లింప్సెస్, సాంగ్స్, సినిమా నుండి వచ్చే ప్రతి అప్‌డేట్ హ్యూజ్ బజ్ ని క్రియేట్ చేస్తున్నాయి. రీసెంట్ గా రిలీజైన నాట్ ఏ టీజర్ వీడియోకి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. అలాగే సినిమాలోని ఇంపార్టెంట్ క్యారెక్టర్స్ ని పరిచయం చేస్తూ రిలీజ్ పోస్టర్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

తాజాగా సరిపోదా శనివారం మేకర్స్ ఈ హైలీ యాంటిసిపేటెడ్ మూవీ ట్రైలర్ రిలీజ్ డేట్ ని అనౌన్స్ చేశారు. ఆగస్ట్ 13న ‘సరిపోదా శనివారం’ ట్రైలర్‌ని విడుదల చేయనున్నారు. ఈ చిత్రాన్ని డివివి ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై డివివి దానయ్య, కళ్యాణ్ దాసరి హై బడ్జెట్, భారీ కాన్వాస్‌తో నిర్మిస్తున్నారు. ఈ పాన్ ఇండియా అడ్రినలిన్ ఫిల్డ్ యాక్షన్-అడ్వెంచర్‌కు జేక్స్ బిజోయ్ మ్యూజిక్ అందిస్తున్నారు. కార్తీక శ్రీనివాస్ ఎడిటర్. ఆగస్ట్ 29, 2024న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ చిత్రం గ్రాండ్ గా విడుదల కానుంది.

## ‘మట్కా’ డబుల్ ఇంపాక్ట్ ఫస్ట్‌లుక్



మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ తన మోస్ట్ ఎక్స్ పెన్సీవ్ మూవీ ‘మట్కా’తో పాన్ ఇండియాలో అడుగుపెడుతున్నారు. కరుణ కుమార్ దర్శకత్వంలో వైర ఎంటర్‌టైన్‌మెంట్స్, ఎస్‌ఆర్‌టి ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి మూవీని మ్యాసీవ్ స్కేల్‌లో నిర్మిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని విడుదల చేశారు మేకర్స్. ఇది వరుణ్ తేజ్‌ను యంగ్ స్టర్, అండ్ మిడిల్ ఏజ్ మ్యాన్‌గా రెండు డిఫరెంట్ అవతార్స్‌లో ప్రజెంట్ చేసింది. సినిమాలో నాలుగు డిఫరెంట్ గెటప్‌లలో హీరో 24 ఏళ్ల జర్నీని అద్భుతంగా చూపించనున్నారు. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో అండర్‌డాగ్ నుంచి ఓవర్‌లార్డ్ వరకు రెండు షేడ్‌లు కనిపిస్తున్నాయి. అతను తన టెరిటరీకి రాజుగా ఎదుగుతాడు. సిగార్ తాగుతూ ఇంటెన్స్ గా కనిపించిన హీరో డాన్ ఇమేజ్‌లో యూత్, డాషింగ్‌గా కనిపించారు. అతని డ్రెస్సింగ్ స్టైల్, హెయిర్ స్టైల్ వింటేజ్ వైబ్ లో అదిరిపోయాయి. రెండు లుక్స్ రిచ్ అండ్ స్టయిలీష్ గా వున్నాయి. తన టేబుల్ మీద తుపాకీ ఉంది. ప్లే కార్డులలో కింగ్ కార్డ్ బ్యాక్ డ్రాప్ గా వుంది. వరుణ్ తేజ్ డిఫరెంట్ షేడ్స్ లో కనిపించిన ఈ ఫస్ట్ లుక్ డబుల్ ఇంపాక్ట్ క్రియేట్ చేసింది. పీరియాడికల్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ సినిమాలో మీనాక్షి చౌదరి, నోరా ఫతేహీ హీరోయిన్లుగా నటిస్తున్నారు.

## బాలకృష్ణ గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్ భారీ ఏర్పాట్లు

కనీవినీ ఎరుగని రీతిలో టాలీవుడ్‌లో ఒక హీరో 50 ఏళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకోవడం గొప్ప విషయం. తన తండ్రి నందమూరి తారక రామారావు నట వారసుడిగా ‘తాతమ్మ కల’ చిత్రంతో తెరంగేట్రం చేసిన నందమూరి బాలకృష్ణ నటుడిగా 50 ఏళ్లు పూర్తి చేసుకుంటున్నారు. నందమూరి ‘నటసింహం’ బాలకృష్ణ బాలనటుడిగా కెరీర్ స్టార్ట్ చేసి తెలుగు సినీ పరిశ్రమకు ఎన్నో హిట్స్, బ్లాక్‌బస్టర్స్ అందించారు. ఇక కెరీర్ పరంగా ఎన్నో మైలురాళ్లు చేరుకున్న . ఆగష్టు 30వ తేదీతో ఆయన నటుడిగా పరిశ్రమలోకి అడుగుపెట్టి 50 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న శుభతరుణంలో ఆయన స్వర్ణోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు తెలుగు చలన చిత్ర పరిశ్రమ భారీగా సన్నాహాలు చేస్తోంది.

బాలకృష్ణ గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్ భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రిక సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఈ మేరకు ఈ వేడుకకు సంబంధించిన ఏర్పాట్లను తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి కార్యదర్శి కె.ఎల్ దామోదర్ ప్రసాద్, తెలంగాణ చలనచిత్ర వాణిజ్య మండలి అధ్యక్షుడు సునీల్ నారంగ్, తెలుగు సినీ నిర్మాతల మండలి కార్యదర్శి టి. ప్రసన్న కుమార్, తెలుగు సినీ కార్మిక సమాఖ్య అధ్యక్షుడు వల్లభనేని అనిల్ దగ్గరుండి చూసుకుంటున్నారు.

ఇటీవల వారంత హైదరాబాద్ బాలయ్యను కలిసి సన్మాన వేడుక గురించి ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. అంతేకాదు ఈ వేడుకకు సంబంధించిన ఏర్పాట్లకు అంగీకారం తెలుపాల్సిందిగా ఆయనను కోరారు. వారి విజ్ఞప్తి మేరకు బాలయ్య గ్రీన్ సిగ్నల్ ఇచ్చారట. దీంతో ఆయన సన్మాన వేడుకకు సంబంధించి ఏర్పాట్లు చకచక జరుగుతున్నాయి. ఈ కార్యక్రమానికి భారతీయ సినిమా, ఇతర రంగాలకు చెందిన ప్రముఖులు హాజరుకానున్నారు. ఈ మేరకు ఆయన సన్మాక వేడుకకు సంబంధించిన ఆహ్వాన పత్రికను ప్రత్యేకంగా డిజైన్ చేశారు. ఇందులో ఆయన సినీరంగానికి చేసిన విశేష సేవలను ప్రస్తావిస్తూ విడుదల చేశారు.

సెప్టెంబరు 1వ తేదీ సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్‌లో ఈ వేడుక ప్రారంభంకానుంది. 50ఏళ్ల సినీ ప్రయాణంలో బాలకృష్ణ 109 సినిమాల్లో కథానాయకుడిగా నటించారు. ఆయన సరసన 129 మంది హీరోయిన్స్ ఆడి పాడారు. భారతీయ నటుల్లో అత్యధిక మంది హీరోయిన్స్‌తో కలిసి నటించిన వ్యక్తిగా ఆయనకు రికార్డు ఉంది. సోషల్, మైథలాజికల్, హిస్టారికల్, బయోపిక్, సైన్స్ ఫిక్షన్ ఇలా అన్ని జానర్స్‌లో నటించిన రికార్డు బాలయ్యకు ఉంది. ఒక స్టార్ హీరో కొడుకు కూడా స్టార్ స్టేటస్ ను సొంతం చేసుకుని ఇన్నేళ్లు విజయాలు సాధిస్తూ కెరీర్ ను కొనసాగించడం బాలయ్యకే సాధ్యమైందని కామెంట్లు వినిపిస్తున్నాయి.

### మొదటిసారిగా వెండితెరపై

నందమూరి బాలకృష్ణ మొదటిసారిగా వెండితెరపై నటించిన సినిమా ‘తాతమ్మకల’, 50 సంవత్సరాల క్రితం అంటే ఆగస్టు 30, 1974లో విడుదలైంది. ఈ సినిమాకి తన తండ్రి లెజెండరీ నటుడు ఎన్.టి. రామారావు దర్శకుడు, అలాగే ఇందులో రెండు విభిన్న పాత్రలు కూడా చేశారు. బాలకృష్ణ లెజెండరీ నటుడు, తండ్రి ఎన్టీఆర్ తో, అప్పట్లో ప్రఖ్యాత నటీమణిగా పేరుపొందిన భానుమతితో కలిసి ఈ ‘తాతమ్మ కల’ సినిమాలో నటించారు. భానుమతికి మనవడిగా కనిపిస్తారు బాలయ్య. అయితే ఈ సినిమాలో మొదటి



సన్నివేశంలో బాలకృష్ణని తండ్రి ఎన్టీఆర్ దర్శకత్వం చేస్తూ నడుచుకుంటూ రమ్మని చెప్పారు. బాలకృష్ణకి అద్దాలు లేని ఒక కళ్ళద్దాల ఫ్రేమ్ పెట్టుకోమన్నారు, నడిచి రమ్మన్నారు. బాలకృష్ణ అప్పుడు ‘నిండు మనసులు’లో ఎన్టీఆర్ ఎలా నడుస్తారో అలా నడుచుకుంటూ వస్తున్నారు.

వెంటనే ఎన్టీఆర్ కట్ చెప్పారట. “నేను నడిచి రమ్మన్నది ఒక స్టూడెంట్ లా, అంతేకానీ రౌడీలా కాదు, వెళ్లి మళ్ళీ స్టూడెంట్ లా నడుచుకుంటూ రా’ అని చెప్పారట. అది మొదటి సన్నివేశం, తండ్రి ఎన్టీఆర్ అలా బాలకృష్ణకి మొదటి దర్శకుడిగా తర్ఫీదు ఇచ్చారని చెపుతూ వుంటారు. ఆ సినిమాలో మొదటగా నటించిన బాలకృష్ణ 50 ఏళ్ళు నటుడిగా ఈ ఆగస్టు 30కి పూర్తి చేశారు.

అయితే బాలకృష్ణ నటించిన ‘తాతమ్మ కల’ సినిమాకి ఇంకో ప్రత్యేకత వుంది. ఆ సినిమాలో ఎన్టీఆర్ బహుసంతానం ఉండాలని అనే విధంగా వచ్చే మాటలు పెట్టారు. అలాగే బాలకృష్ణ, భానుమతి లకి నలుగురు కొడుకులు, ఒక కుమార్తె. అలాగే నిజ జీవితంలో కూడా ఎన్టీఆర్ కి చాలామంది సంతానం అనే విషయం అందరికీ తెలిసిన విషయమే. సినిమాలో వివాదాస్పద అంశాలు, అభ్యంతరక సన్నివేశాలు ఉంటే సెన్సార్ సమస్యలు రావడం పరిపాటే. సెన్సార్ సూచనలతో సినిమా సీన్లను మారుస్తుంటారు. ఆ సినిమా విడుదల అయ్యే సమయంలో కేంద్ర ప్రభుత్వం కుటుంబ నియంత్రణకై కృషి చేస్తున్న సమయంలో, ఈ సినిమాలో ఫ్యామిలీ ప్లానింగ్‌ను వ్యతిరేకిస్తూ భానుమతితో డైలాగ్స్ అందుకు వ్యతిరేకంగా ఉండటం అలాగే భూ సంస్కరణలను కూడా వ్యతిరేకిస్తూ ప్రభుత్వ విధానాలను విమర్శించేలా డైలాగ్స్ ఉన్నాయి. దాంతో ఈ సినిమాపై అసెంబ్లీలో తీవ్రమైన చర్చ జరిగింది. ఫలితంగా తాతమ్మ కల సినిమాను రెండు నెలలు నిషేధించారు.

దీంతో విడుదలైన అన్ని కేంద్రాల్లో 50 రోజులు పూర్తి చేసుకున్న తర్వాత సినిమాలో అభ్యంతరకర సన్నివేశాలు ఉన్నాయని బ్యాన్ చేయడం తాతమ్మకల మూవీకే జరిగింది. అప్పుడు అందులో సన్నివేశాలకు ఎన్టీఆర్ వివరణ ఇచ్చారు. కుటుంబ నియంత్రణకు, భూ సంస్కరణలకు తాను వ్యతిరేకం కాదని, దేశంలోని ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేస్తే అవి అవసరం లేదనేది,తాను చెప్పదలుచుకున్న కథని ఆ సినిమాలో సరిగ్గా చెప్పలేకపోయాను, ప్రేక్షకులు సరిగ్గా అర్థం చేసుకోలేకపోయారు అని ఆ సినిమాని 50 రోజులకు తనే ఆపుచేశారు. మళ్ళీ కొన్ని మార్పులు, చేర్పులులతో మరోమారు రీ షూట్ చేసి ఆ చిత్రాన్ని జనవరి 8, 1975లో విడుదలచేశారు. మొదటిసారి విడుదలైనప్పుడు బాలకృష్ణకి పి సుశీల ప్లేబాక్ పాడారు, కానీ మళ్ళీ విడుదల చేసినప్పుడు మాధవపెద్ది రమేష్ తో పాడించారు. ఎన్టీఆర్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో బాలకృష్ణతోపాటు నందమూరి హరికృష్ణ కూడా నటించారు. అలాగే సినిమాలో కూడా ఇంకొన్ని మార్పులు చేర్పులు చేశారు. ఇలా బాలకృష్ణ మొదటి సినిమా రెండు సార్లు విడుదల కావటం అప్పట్లో విపరీతంగా చర్చించుకున్నారు. ఆ తర్వాత ‘రామ్ రహీమ్’ నుంచి ‘సింహం నవ్వింది’ వరకూ ఎన్నో సినిమాల్లో కీలక పాత్రల్లో మెప్పించారు.

### ద్విపాత్రల్లో

ముఖ్యంగా బాలయ్య ద్విపాత్రాభినయం చేసిన సినిమాలెన్నో. తొలిసారి ‘అపూర్వ సహోదరులు’ సినిమాతో బాలయ్య డ్యూయల్ రోల్ ప్రస్థానం మొదలైంది. ఆ తర్వాత ‘రాముడు-భీముడు’, ‘బ్రహ్మర్షి విశ్వామిత్ర’, ‘ఆదిత్య 369’, ‘మాతో పెట్టుకోకు’, ‘శ్రీకృష్ణార్జున విజయం’, ‘పెద్దన్నయ్య’, ‘ సుల్తాన్’, ‘చెన్న కేశవరెడ్డి’, ‘అల్లరి పిడుగు’ ఇలా చాలా చిత్రాల్లో ద్విపాత్రాభినయంతో అలరించారు.

### వారసత్వంగా రాజకీయాల్లో కూడా

మరో పక్క తండ్రి వారసత్వంగా రాజకీయాల్లో కూడా కొనసాగుతున్నారు. ఇకపోతే సినిమాల్లో, రాజకీయాల్లో తండ్రిలా ఎదిగిన బాలకృష్ణ సామాజిక సేవల్లో కూడా పాల్గొంటూ తన మంచి మనసును చాటుకుంటుంటారు. ముఖ్యంగా.. బసవతారకం పేరుతో క్యాన్సర్ హాస్పిటల్ ఛైర్మన్‌గా సేవా రంగంపైనా తనదైన ముద్ర వేశారు. కనుక ఇన్ని ఘనతల సాధించిన నేపథ్యంలో తెలుగు చిత్ర పరిశ్రమ బాలకృష్ణను సెప్టెంబరు 1న ఘనంగా సన్మానించనుంది.

### ప్రత్యేక ఆహ్వానీతులుగా

టాలీవుడ్‌లో 50 ఏళ్ల ఈ జర్నీని పురస్కరించుకుని సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లో జరగనున్న ఈ భారీ ఈవెంట్ కు టాలీవుడ్, రాజకీయ వర్గాలకు చెందిన వారు హాజరు కానున్నారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పవన్ కళ్యాణ్, ఇతర సినీ నటులు, రాజకీయ ప్రముఖులు పాల్గొనే అవకాశాలు ఉన్నాయి.

Published by **Bodepudi Venkata Subbarao Managing Director** on behalf of Mahanadu Media pvt ltd. **Editor: Marthi Subrahmanyam** Phone: 9705311144